ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
శనివారం 1 నవంబరు 2025





వేడుకల్లో వివిధ దేవతామూర్తుల వేషధారణలతో కళాకారులు, కీర్తనలు ఆలపిస్తున్న పండితులు

తంజావూరులో



గుర్రపు బగ్గీలో రాజరాజ చోళుడి వేషంలో ఊరేగుతున్న జానపద కళాకారుడు

రాజరాజచోళుడి జయంత్యుత్సవాలు

● వివిధ వేషధారణలతో హాజరైన కళాకారులు

చెన్నై, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తంజావూరు బృహదీశ్వరాలయంలో చోళచక్రవర్తి రాజరాజచోళుడి 1040వ సదయ వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. చోళ సామ్రాజ్య చక్రవర్తి రాజరాజచోళుడు తమిళ మాసమైన ఐప్పసిలో సదయం (శతభిషం) నక్షత్ర పర్వదినాన జన్మించారు. అదే నక్షత్ర పర్వదినంలోనే ఆయన చోళ సామ్రాజ్య చక్రవర్తిగా పట్టాభిషిక్తుడైనట్లు చరిత్ర చెబుతోంది. ఈ రెండు వేడుకలను కలిపి సదయ ఉత్సవాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతియేటా రెండు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తోంది. బృహదీశ్వరాలయంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు మంగళవాయిద్యాలు, కళిమేడు అప్పర్‌పేరవై తిరుమురై గానాలతో ఈ ఏడాది వేడుకలకు శ్రీకారం చుట్టారు. తంజావూరు రాజమహల్ నుంచి కళాకారులు వివిధ వేషాలతో సదయ వేడుకల ఊరేగింపులో పాల్గొన్నారు. తంజావూరు జిల్లా కలెక్టర్ పి.ప్రియంక పంకజం నేతృత్వంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. రాజరాజచోళుడి హయాంలో ఆయన మంత్రివర్గ సహచరులతో ఏ విధంగా నగర సంచారం చేసేవారో దానిని నేటి తరానికి కళ్ళకు కట్టినట్లు కళాకారులు వేషాలు ధరించి గుర్రపు బగ్గీలపై తంజావూరు నగరమంతా ఊరేగారు. ఈ నగర సంచార కార్యక్రమం పాత బస్టాండు నుంచి బృహదీశ్వరాలయం వరకూ కొనసాగింది. దారి పొడవునా రాజరాజ చోళుడి కీర్తి ప్రతిష్ఠలను తెలిపే కీర్తనలకు అనుగుణంగా సుమారు 200 మందికి పైగా బాలికలు నాట్యం చేశారు. ఆ తరువాత రాజరాజచోళుడి విగ్రహం వద్ద జరిగిన పుష్పాంజలి కార్యక్రమంలో సుమారు 400 మంది కళాకారులు పాల్గొన్నారు. సాయంత్రం బృహదీశ్వరాలయ ప్రాంగణంలో రాజరాజచోళుడి జీవిత విశేషాలతో నాటక ప్రదర్శన జరిగింది. బృహదీశ్వరాలయం ప్రాంగణంలోని వేదికపై వివిధ కళాకారులు దేవతామూర్తుల వేషాలు ధరించి నిలిచారు. వారి ముందు శైవ పండితులు, ఓదువార్లు, వేద పండితులు పెరువుడయార్ (బృహదీశ్వరుడిని)ను, రాజరాజచోళుడి వైశిష్ట్యాన్ని తెలిపే కీర్తనలను గానం చేశారు. శనివారం ఉదయం 7.20 గంటలకు రాజరాజచోళుడి విగ్రహానికి నగర ప్రముఖులు నివాళులర్పించనున్నారు. ఆ తర్వాత పెరువుడయార్, పెరియనాయకి అమ్మవారికి మహాభిషేకం చేస్తారు. మధ్యాహ్నం పెరుందీపారాధన, భరతనాట్య ప్రదర్శన జరుగుతాయి. రాత్రి 7 గంటలకు రాజరాజచోళుడిపై పరిశోధనలు జరిపినవారికి, తమిళ సాహిత్యానికి, సంస్కృతికి విశిష్ట సేవలందించిన ప్రముఖులు, పండితులకు అవార్డులను ప్రదానం చేయనున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.మహాదేవన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కుంద్రక్కుడి ఆధీనం పొన్నంబళ అడిగళార్ వివిధ కళాకారులకు అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ వేడుకలను పురస్కరించుకుని తంజావూరు జిల్లాకు శనివారం సెలవు ప్రకటించారు. సదయ వేడుకల సందర్భంగా తంజావూరు బృహదీశ్వరాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించడంతో పాటు తంజావూరు నగరమంతటా విద్యుత్ దీపాల తోరణాలు కట్టారు.



రాజరాజచోళుడిని ఆహ్వానిస్తూ స్వాగతం పలుకుతున్న ఓదువార్ యువకుడు

అనుమానం పెనుభూతమై...!


● పిల్లలను చంపి కార్మికుడి ఆత్మహత్య

చెన్నై, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అనుమానం పెనుభూతమైంది.. భార్యపై అనుమానం పెంచుకున్న ఓ వ్యక్తి.. తన ఇద్దరు పిల్లలను హతమార్చి, తనూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన తిరువణ్ణామలై జిల్లా ఆరణి సమీపం తెల్లూరు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా వున్నాయి... తెల్లూరుకు చెందిన కృష్ణన్ (44), పూంగొడి దంపతులకు కుమార్తె కయల్‌విళి (9), కుమారుడు నిదర్శన్ (7) ఉన్నారు. కృష్ణన్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కొన్నేళ్ల క్రితం కృష్ణన్ కుటుంబంతో కలిసి చెన్నైలో కాపురముండేవాడు. అప్పట్లో భార్యపై అనుమానంతో తరచూ గొడవపడుతుండేవాడు. ఆ తర్వాత ఆమెను వేధింపులకు గురిచేశాడు. దీనితో పూంగొడి పుట్టింటికి వెళ్ళిపోయింది. పిల్లలు కృష్ణన్ వద్దే ఉండేవారు. ఇటీవల దీపావళి సందర్భంగా కృష్ణన్ తన స్వగ్రామం తెల్లూరుకు పిల్లలను తీసుకెళ్లాడు. దీపావళి గడిచినా అతడు చెన్నై తిరిగి వెళ్లలేదు. భార్య విడిచిపెట్టిందన్న కోపంతో రోజూ తాగి ఇంటికి చేరుకునేవాడు. ఈ నేపథ్యంలో గురువారం పగలంతా పనులకు వెళ్లిన కృష్ణన్.. పక్కింటిలో ఆడుకుంటున్న తన పిలలలను ఇంటికి పిలిచాడు. రాత్రి పిల్లలిద్దరూ నిద్రపోగా, పీకలదాకా మద్యం తాగి ఉన్న కృష్ణన్ నిద్రపోతున్న పిల్లలను గొంతు నులిమి హతమార్చి, ఆ తర్వాత గదిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం కృష్ణన్ ఇంటి నుండి ఎలాంటి అలికిడి వినిపించకపోవటంతో చుట్టుపక్క వారి ఇంటిలోపలకు వెళ్ళి చూడగా కృష్ణన్ శవంగా వేలాడుతుండటం, నేలపై ఇద్దరు పిల్లల మృతదేహాలు ఉండటం గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సేత్తుపట్టు పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ముగ్గురి మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు.

హైకోర్టు మదురై బెంచ్‌కు బాంబు బెదిరింపు

● పోలీసుల తనిఖీలు

చెన్నై, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు మదురై ధర్మాసనానికి బాంబు బెదిరింపు రావడంతో అక్కడ కొద్ది సేపు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ధర్మాసనం ప్రాంగణంలో బాంబులు పెట్టామని, అవి కొద్దిసేపట్లో పేలనున్నాయంటూ గుర్తు తెలియని వ్యక్తి ఈ మెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడడంతో పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో వెళ్లి తనిఖీలు జరిపారు. శుక్రవారం ఉదయం పోలీసులు, బాంబ్ స్క్వాడ్, జాగిలాలను చూసి ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఆ ప్రాంగణమంతా క్షుణ్ణంగా తనిఖీ చేసిన పోలీసులు.. అది ఉత్తుత్తి బెదిరింపేనని తేల్చడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా వుండగా చెన్నైలోని 'తమిళగ వెట్రి కళగం' కార్యాలయానికి కూడా గురువారం రాత్రి బాంబు బెదిరింపు వచ్చింది. అయితే పోలీసులు అక్కడ తనిఖీలు జరిపి, అది ఉత్తుత్తి బెదిరింపేనని తేల్చారు.



హైకోర్టు ప్రాంగణంలో తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్

రాష్ట్రానికి ఫోర్డ్ పునరాగమనం

● రూ.3250 కోట్లతో ఇంజిన్ల కర్మాగారం ● సీఎం స్టాలిన్ సమక్షంలో కుదిరిన ఒప్పందం

చెన్నై, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫోర్డ్ కంపెనీ మళ్లీ ఉత్పత్తులు ప్రారంభించేందుకు సిద్ధమైంది. గత యేడాది సెప్టెంబర్‌లో ముఖ్యమంత్రి స్టాలిన్ ఆ కంపెనీ ప్రతినిధులతో భేటీ అయినప్పుడు రాష్ట్రంలో మళ్లీఉత్పత్తులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు చెన్నై సచివాలయంలో శుక్రవారం ఉదయం ఫోర్డ్ కంపెనీ ప్రతినిధులు సీఎం స్టాలిన్‌తో చర్చలు జరిపారు. ఆ తర్వాత ఫోర్డ్ సంస్థ రూ.3250 కోట్లతో వాహన ఇంజిన్ల తయారీ ప్లాంట్ నెలకొలేందుకు ప్రభుత్వ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రి టీఆర్బీ రాజా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, పరిశ్రమలు పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖ కార్యదర్శి వి.అరుణ్‌రాయ్, మార్గదర్శక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ధరేస్ అహమ్మద్, ఫోర్డ్ సంస్థ డైరెక్టర్ మార్టిన్ ఎవరిట్, ఉపాధ్యక్షుడు మాథ్యూ కోటిలూస్కీ, థాయ్‌లాంట్ ప్రాజెక్ట మేనేజింగ్ డైరెక్టర్ సైమోనేట్టా వెర్డీ, డైరక్టర్ (ఉత్పత్తులు) ధీరజ్ దీక్షిత్, డైరెక్టర్ శ్రీపాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఒప్పందం గురించి సీఎం స్టాలిన్ ఎక్స్‌పేజీలో ఓ సందేశం పోస్ట్ చేసారు. ఫోర్డ్ సంస్థ సంపూర్ణ శక్తిసామర్థ్యాలతో చెన్నై నగరంలో మళ్లీ ఉత్పత్తులు ప్రారంభించేందుకు రావటం తనకెంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ఫోర్డ్ సంస్థ తన మరైమలర్ నగర్ ప్లాంట్‌లో రూ.3250 కోటతో నెక్స్ జనరేషన్ వెహికల్ ఇంజిన్ల తయారీ యూనిట్ నెలకొల్పనుందన్నారు. ఈ యూనిట్ ద్వారా 600 మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించనున్నారని, ఫోర్డ్ సంస్థ నిర్ణయం రాష్ట్రంలో ఆటోమొబైల్ విడిభాగాల ఉత్పత్తుల రంగం మరింతగా అభివృద్ధి చెందుతుందని స్టాలిన్ పేర్కొన్నారు.



సీఎం స్టాలిన్ సమక్షంలో కుదిరిన ఒప్పంద పత్రాలను ప్రదర్శిస్తున్న ఫోర్డ్ సంస్థ నిర్వాహకులు, ప్రభుత్వ అధికారులు

ఎస్ఐఆర్‌పై అవగాహన ముఖ్యం

● జీసీసీ కమిషనర్ కుమరగురుబరన్

పారీస్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో కీలకమైన ప్రిసైడింగ్ అధికారులు, సిబ్బంది తమ విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి జె.కుమరగురుబరన్ సూచించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ సూచనల మేరకు నగరంలో ఈ నెల 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ విధుల్లో పాల్గొననున్న ప్రిసైడింగ్ అధికారులు (పీవో), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీవో)లతో జీసీసీ ప్రధాన కార్యాలయం రిప్పన్ భవనంలో ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరాన్ని కుమరగురుబరన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ శిబిరంలో రాజ్యాంగంలో 1980 ప్రజాప్రతినిధుల చట్టం 1951, ఓటరు జాబితా నిబంధనలు 1960, ఎన్నికల విధులు 1961, సుప్రీంకోర్టు తీర్పు, కేంద్ర ఎన్నికల కమిషన్ విడుదల చేస్తున్న ప్రకటనల ఆధారంగా ఎన్నికలు సజావుగా ఎలా నిర్వహించాలన్న దానిపై కుమరగురుబరన్ మెళకువలు నేర్పించారు. రాజధాని నగరంలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితా సవరణ పనుల్లో పాల్గొనే అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, కొత్త ఓటర్లను జాబితాలో చేర్చేందుకు ఫారమ్-6 అందజేయాలని, ఒక్కొక్క ఓటరు ఇంటికి కనీసం 3సార్లు వెళ్లి జాబితా పరిశీలించాలని ఆయన సూచించారు. పోలింగ్ బూత్ అధికారులు (బీఎల్‌వో) ఓటరు జాబితా సవరణ పూర్తయ్యే వరకు వారికి కేటాయించిన నియోజకవర్గాల్లో విధుల్లో పాల్గొనాలని కమిషనర్ సూచించారు.



ఎన్నికల శిక్షణ శిబిరంలో ప్రసంగిస్తున్న జీసీసీ కమిషనర్, చెన్నై జిల్లా ఎన్నికల అధికారి



దోమల బెడద తగ్గించండి మహాప్రభో!

● తాంబరం కార్పొరేషన్ సమావేశంలో అన్నాడీఎంకే వినూత్న నిరసన ● దోమతెరలతో వచ్చిన కార్పొరేటర్లు

పారీస్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నిసార్లు మొత్తుకున్నా దోమలు, కుక్కలు, పశువుల బెడద గురించి పట్టించుకోని తాంబరం కార్పొరేషన్ అధికారుల వైఖరికి నిరసనగా ప్రతిపక్ష అన్నాడీఎంకే సభ్యులు శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి దోమతెరలు కప్పుకుని హాజరయ్యారు. తాంబరం కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం మేయర్ వసంతకుమారి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి అన్నాడీఎంకేకు చెందిన 9 మంది కార్పొరేటర్లు నల్ల జెండాలతో నిరసన తెలుపుతూ ర్యాలీగా వచ్చారు. నినాదాలు చేస్తూ కౌన్సిల్ హాలులోకి ప్రవేశించారు. ఇందుకు డీఎంకే సభ్యులు అభ్యంతరం తెలుపుతూ వారిని సభ నుంచి గెంటేయాలని నినాదాలు చేశారు. దీంతో మేయర్ ఆదేశాలతో మార్షల్స్ అన్నాడీఎంకే సభ్యులందరిని బయటికి గెంటేశారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలో అన్నాడీఎంకే సభ్యులందరూ బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిల్‌లో అన్నాడీఎంకే నేత షోళయూర్ శంకర్ మాట్లాడుతూ... దోమలు, కుక్కలు, పశువుల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు న్యాయం చేయాలని పలుమార్లు కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్లకు వినతి పత్రాలు సమర్పించినా ఎలాంటి ఫలితం లేనందువల్లే తాము నిరసన చేపట్టాల్సివచ్చిందన్నారు. ఒకట్రెండు రోజుల్లో ప్రజా సమస్యలను పరిష్కరింపజేయకుంటే తమ వార్డు ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపట్టనున్నట్లు శంకర్ హెచ్చరించారు.



దోమతెరలు కప్పుకుని కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న అన్నాడీఎంకే సభ్యులు

అన్నాడీఎంకే నుంచి సెంగోట్టయ్యన్ డిస్మిస్

పారీస్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పార్టీ నిబంధనలను అతిక్రమించిన ఈరోడ్ జిల్లా గోపిచెట్టిపాళయం ఎమ్మెల్యే, అన్నాడీఎంకే సీనియర్ నేత కేఏ సెంగోట్టయ్యన్‌ను డిస్మిస్ చేసినట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ప్రకటించారు. గత కొన్నాళ్లుగా ఈపీఎస్‌పై సెంగోట్టయ్యన్ తిరుగుబాటు చేయడంతో పాటు పార్టీ కార్యకలాపాలకు దూరంగా వుంటున్నారు. అంతేగాక ప్రత్యామ్నాయ మార్గాల కోసం బీజేపీ అగ్రనేతలతోనూ భేటీ అయ్యారు. అవేవీ సత్ఫలితాన్ని ఇవ్వకపోవడంతో ఆఖరికి అన్నాడీఎంకే బహిష్కృత నేతలు ఒ.పన్నీర్‌సెల్వం, శశికళ పంచన చేరారు. ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు పసుంపొన్ ముత్తురామలింగ దేవర్ జయంతి సందర్భంగా గురువారం అన్నాడీఎంకే బహిష్కృత నేతలతో కలిసి నివాళులర్పించారు. మరోవైపు విడిపోయిన అన్నాడీఎంకే విలీనమయ్యేందుకు ఈపీఎస్‌కు సెంగోట్టయ్యన్ పది రోజుల గడువు విధించడంతో అయనను వెంటనే పార్టీ పదవి నుండి తొలగించారు. ఈ నేపథ్యంలో, సేలంలో శుక్రవారం ఉదయం పార్టీ ముఖ్యనేతలతో ఈపీఎస్ సమావేశమయ్యారు. సుమారు గంట సేపు జరిగిన ఈ సమావేశంలో అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధ కావడం, బూత్ కమిటీల నియామకం, రాష్ట్రప్రజలను మెప్పించేలా మేనిఫెస్టో రూపకల్పన తదితర అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ, గత కొన్ని నెలలుగా పార్టీ కట్టుబాట్లను ఉల్లంఘించి వ్యవహరిస్తున్న సెంగోట్టయ్యన్‌ను అన్నాడీఎంకే సాధారణ సభ్యత్వం నుండి తొలగిస్తున్నట్లు ప్రకటించారు.



ఆది నుంచి ఆయన తీరు అంతే!

అన్నాడీఎంకే సీనియర్ నేత సెంగోట్టయ్యన్ తీరు ఆది నుంచి సంచలనమే. ఎంజీఆర్‌కు వీరాభిమాని అయిన సెంగోట్టయ్యన్.. ఆ తరువాత జయలలిత పంచన చేరి, ఆమెకు కుడిభుజంగా మెలిగారు. జయ రాష్ట్ర వ్యాప్త పర్యటన ఆయనే ఖరారు చేసేవారు. అయితే జయ మరణానంతరం .. ఓపీఎస్ పంచన చేరిన సెంగోట్టయ్యన్.. అన్నాడీఎంకేకు దూరం జరిగారు. కానీ ఆ తరువాత జరిగిన పరిణామాల్లో మళ్లీ ఈపీఎస్ నీడన చేరిన సెంగోట్టయ్యన్.. 2021 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తరువాత కూడా ఈపీఎస్‌తో సఖ్యతగానే నడచుకున్నారు. కానీ ఏడాది నుంచి మళ్లీ ఓపీఎస్ వైపు మొగ్గారు.. ఓపీఎస్, శశికళ, దినకరన్‌లను మళ్లీ పార్టీలోకి చేర్చుకోవాలంటూ పలుమార్లు డిమాండ్ చేసిన ఆయన.. ఆ ప్రయత్నాలు సఫలమయ్యే సూచనలు కనిపించకపోవడంతో.. పార్టీకి దూరంగా వుంటున్నారు. ఆయన ఈపీఎస్ వ్యతిరేకంగానూ పలుమార్లు ప్రకటనలు గుప్పించారు. దాంతో కంట్లో నలుసులా తయారైన సెంగోట్టయ్యన్‌ను ఈపీఎస్ పార్టీ నుంచి డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించారు.

నాలుగున్నరేళ్లలో 3740 ఆలయాలకు కుంభాభిషేకం

● డీఎంకే సర్కారు రికార్డు ● మంత్రి పీకే శేఖర్‌బాబు

చెన్నై, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ద్రావిడ తరహా పాలనలో గత నాలుగున్నరేళ్లలో సుప్రసిద్ధమైన, శిథిలావస్థలో నిర్ణీత సమయంలో సంప్రోక్షణ జరగని 3740 ఆలయాలకు కుంభాభిషేకాలు నిర్వహించి కొత్త రికార్డు నెలకొల్పినట్లు దేవాదాయ శాఖమంత్రి పీకే శేఖర్‌బాబు పేర్కొన్నారు. నగరంలోని ఓట్టేరిలో శుక్రవారం ఉదయం చెల్లప్పరాయర్ పెరుమాళ్ ఆలయ కుంభాభిషేక వేడుకల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత కోయంబేడు కురుంగాలీశ్వరాలయం, వైకుంఠ వాస పెరుమాళ్ ఆలయంలో రూ.53.90 లక్షలతో నిర్మించిన కొత్త రథాల ట్రయల్ రన్ పరిశీలించారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఒట్టేరి చెల్లప్పరాయర్ పెరుమాళ్ ఆలయానికి రూ.1.02 కోట్లతో జీర్ణోద్ధరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. బీసెంట్ నగర్ మహాలక్ష్మి ఆలయానికి కూడా 12 యేళ్ల తర్వాత రూ.2.08 కోట్లతో జీర్ణోద్ధరణ పనులు పూర్తి చేసి కుంభాభిషేకం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

సమాచార దృష్టి

నగరంలో రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా నవంబర్ 2వ తేదీ (ఆదివారం) చెన్నై నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు (ఈబీ) విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి. అంబత్తూరు ఎస్టేట్.. అంబత్తూరు పారిశ్రామిక వాడలో సెక్టార్ 1, మొదటి క్రాస్‌వీధి, 6 నుండి 9వీధులు, మూడవక్రాస్ ప్రధాన వీధి, సిప్కో కార్మిక పారిశ్రామికవాడ 1 నుండి 3 క్రాస్ వీధులు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా శనివారం చెన్నై నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు (ఈబీ) విడుదల చేసిన ప్రకటనలో వివరాలు ఇలా ఉన్నాయి. **తరమణి:** ఎంజీఆర్‌రోడ్డు, సంధియప్పన్‌రోడ్డు, కోదండ రామన్‌రోడ్డు, పెరుంగుడి, ఓఎంఆర్, కామరాజర్‌నగర్, కురింజినగర్, నెహ్రూనగర్, కొట్టివాక్కం, శ్రీనివాసనగర్, జీయేంద్రకాలనీ, తిరువళ్లూరు రోడ్డు, కర్పగ వినాయర్‌రోడ్డు,చర్చిరోడ్డు, ఎబీఐ కాలనీ. **పల్లావరం:** జమీన్‌రాయపేట, సెంథిల్‌నగర్, శక్తినగర్, కురింజి నగర్, అరుళ్ మురుగన్ రామమూర్తినగర్.

గ్రూప్-4 పోస్టుల సర్టిఫికెట్ల పరిశీలన

ప్యారీస్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టుల భర్తీ చేసేందుకు నిర్వహించిన గ్రూప్-4 ఫలితాలు ఇటీవల విడుదలైన నేపథ్యంలో, సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) ప్రకటించింది. ఫలితాల జాబితాలో ఉన్న అభ్యర్థులు తమ విద్యార్హత, వయసు, చిరునామా తదితర వివరాలతో కూడిన సర్టిఫికెట్లను నవంబర్ 7వ తేదీలోగా టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవాల్సివుంటుంది. గడువులోగా డౌన్‌లోడ్ చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను మాత్రమే పరిశీలనకు స్వీకరించనున్నట్లు ఆ సంస్థ తెలిపింది.

తాంబరం - విల్లుపురం రైలు వేళలో మార్పు

చెన్నై, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముడియంబాక్కం రైల్వేయార్డులో శని, ఆదివారాల్లో మరమ్మతుల కారణంగా రైలు సమయం మార్పు చేసినట్టు దక్షిణరైల్వే ప్రకటించింది.. తాంబరం - విల్లుపురం మధ్య ఉదయం 9.45 గంటలకు బయలుదేరే రైలు దిండివనం వరకు మాత్రమే వెళ్లనుంది. విల్లుపురం నుంచి బీచ్‌కు మధ్యాహ్నం 1.40 బయలుదేరే రైలు దిండివనం నుంచి బయలుదేరనుంది. ఈ మార్పు ఈ రెండు రోజులు మాత్రమే వుంటాయని దక్షిణరైల్వే ప్రకటించింది.

ఐదుగురు అధికారులకు పదోన్నతి

ప్యారీస్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వంలో విశేష అనుభవం కలిగిన రెవెన్యూశాఖ అధికారులకు ఐఏఎస్‌లుగా పదోన్నతి కల్పిస్తూ కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. 2023వ సంవత్సరం ఎంపిక జాబితా ప్రకారం రాష్ట్రానికి చెందిన ఎస్.కవిత, సి.ముత్తుకుమరన్, పీఎస్ లీలా అలెక్స్, ఎం.వీరప్పన్, ఆర్.రేవతి ఐఏఎస్ అధికారులుగా పదోన్నతి పొందారు.

నవంబరు 3, 4 తేదీల్లో ఇళ్లకే రేషన్ సరకులు

చెన్నై,అక్టోబరు31(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో 'ముఖ్యమంత్రి తాయ్‌మానవర్ పథకంకింద వృద్ధులు, దివ్యాంగుల కోసం నవంబరు 3, 4, తేదీల్లో ఇళ్లకే రేషన్ సరకుల సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు.ప్రతినెలా 2వ శనివారం,2వ ఆదివారం రేషన్ సిబ్బంది ఇళ్లకే రేషన్ సరకులను సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. ఈశాన్య రుతుపవనాలతో కొన్ని జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. అందువల్ల నవంబరు మొదటి వారంలోనే, అంటే 3, 4తేదీల్లోనే ఇళ్లకురేషన్‌సరకులుపంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కిందిస్థాయి అధికారులకూ ఆదేశాలు వెళ్లినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

సీబీఎస్ఈ టెన్త్, ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షల టైమ్ టేబుల్ విడుదల

ప్యారీస్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) టెన్త్, ప్లస్‌టూ తరగతుల విద్యార్థులు వచ్చే ఏడాది ఫిబ్రవరి 17 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ పరీక్షల టైమ్‌టేబుల్ విడుదలైంది. సీబీఎస్ఈ తన ఎక్స్‌పేజీలో విడుదల చేసిన టైం టేబుల్‌లో వివరాలిలా ఉన్నాయి. పబ్లిక్ పరీక్షల టైమ్‌టేబుల్ మొట్టమొదటిసారిగా 119 రోజులకు ముందే విడుదల చేసినట్లు వివరించింది. టెన్త్ పరీక్షలు 2026 ఫిబ్రవరి 17 నుంచి మార్చి 10వ తేదీ వరకు జరుగుతాయి. అదేవిధంగా ప్లస్‌టూ ఫిబ్రవరి 17న ప్రారంభమై ఏప్రిల్ 7వ తేదీ వరకు జరగనున్నాయి. పూర్తివివరాలను "https://www.cbse.gov.in/" వెబ్‌సైట్ నుండి విద్యార్థులు, టీచర్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

భూటాన్‌లో ఉద్యోగావకాశాలు

చెన్నై, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): భూటాన్‌లోని ఆస్పత్రుల్లో నర్సు పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. తమిళనాడు ప్రభుత్వ విదేశీ ఉద్యోగాల కల్పనా సంస్థ ప్రకటన విడుదల చేసింది. భూటాన్ ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆస్పత్రుల్లో పని చేసేందుకు రెండేళ్ల అనుభవం, బీఎస్సీ నర్సింగ్ పాసై, 23-45 ఏళ్ల లోపు మహిళలు కావాల్సివుంది. 2-5 ఏళ్ల అనుభవం ఉంటే నెలకు రూ.65 వేలు, 6-10 ఏళ్ల అనుభవం వున్న వారికి రూ.75 వేలు, అంతకు మించిన అనుభవం వున్న నర్సులకు రూ.86 వేల జీతం ఇవ్వనున్నారు. ఔత్సాహికులు www.omcmanpower.tn.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు. అంతేగాక దరఖాస్తులు, ఎక్స్‌పీరియన్స్, విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లను ovemclmohsa2021@gmail.com మెయిల్‌కు నవంబరు 3 లోగా పంపించవచ్చని తెలిపారు.

ఎంబీబీఎస్ సీట్లు పెరిగే అవకాశం

చెన్నై, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లు పెరిగే అవకాశమున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దీంతో నవంబరు 1వ తేదీ మధ్యాహ్నం తరువాత మూడో కౌన్సెలింగ్‌లో పాల్గొనే విద్యార్థులు సీట్లను ఎంపిక చేసుకోవచ్చని ఆ వర్గాలు వివరించాయి. తమిళనాట ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు రెండు కౌన్సెలింగ్‌లు ముగిసిన విషయం తెలిసిందే. ఈ మధ్యలో కొత్త 250 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా చేరాయి. వాటి కోసం ఇంతకు ముందే ఖాళీగా వున్న సీట్లకు గాను మూడో విడత కౌన్సెలింగ్ జరుగనుంది. ఆ మేరకు 2వ తేదీ సీట్లు కేటాయించనున్నారు. 3వ తేదీ పూర్తిస్థాయి ఫలితాలు వెలువడనున్నాయి.

కరూర్ తొక్కిసలాట ప్రాంతంలో సీబీఐ తనిఖీలు



కరూర్ వేలుచ్చామిపురం వద్ద సీబీఐ అధికారులు

చెన్నై, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కరూర్ దుర్ఘటనపై దర్యాప్తు జరుపుతున్న సీబీఐ అధికారులు శుక్రవారం ఉదయం తొక్కిసలాట జరిగిన వేలుచ్చామిపురాన్ని పరిశీలించారు. 11 రోజుల విరామం తర్వాత ఎస్పీ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలోని ఆరుగురు అధికారులు గురువారం విచారణ పునఃప్రారంభించారు. శుక్రవారం ఉదయం 9.45 గంటలకు సీబీఐ అధికారులు వేలుచ్చామిపురంలో తొక్కిసలాట జరిగిన ప్రాంతాన్ని తనిఖీ చేశారు. ఈ తొక్కిసలాటపై విచారణ జరిపిన కరూరు ఎస్సై మణివన్నన్‌ను సుమారు గంటన్నర సేపు విచారణ నిర్వహించారు. ఆ తర్వాత వేలుచ్చామిపురంలో దుకాణాల యజమానులు, స్థానికులను రోడ్‌షో జరిపిన సమయంలో తొక్కిలాట ఏ విధంగా జరిగింది. ఎంతమంది చిక్కుకున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. విజయ్ ప్రచారం చేసిన ప్రాంతానికి దగ్గరగా జనరేటర్ గది ర్పాటు చేసిన ప్రాంతాన్ని కూడా అధికారులు పరిశీలించారు. అదే విధంగా విజయ్ వాహనం నిలిచిన ప్రాంతం చుట్టూ జరిగిన సంఘటనలపై కూడా స్థానికుల నుంచి వివరాలు సేకరించారు.

పుదుచ్చేరిలో విద్యుత్ ఛార్జీలు పెంచలేదు

● మంత్రి నమశ్శివాయం



పుదుచ్చేరి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో విద్యుత్ ఛార్జీలు పెంచలేదని విద్యుత్‌శాఖ మంత్రి నమశ్శియం పేర్కొన్నా రు. కేంద్రపాలిత రాష్ట్రంలో పుదుచ్చేరిలో గృహాల విద్యుత్‌కు యూనిట్‌కు 20 పైసలు పెంచారని, ఇది శనివారం నుండి అమలుకు వస్తుందని సోషల్ మీడియాలో సమాచారం రావడంతో ఆ రాష్ట్రప్రజలు ఆందోళనకు గురైయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మంత్రి నమశ్శివాయం మీడియాతో మాట్లాడుతూ, తమ రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెంచారనే కథనాల్లో వాస్తవం లేదన్నారు. ప్రజలపై రుణభారం పెంచే విధంగా ప్రభుత్వం పనిచేయడం లేదని, పాత విద్యుత్ ఛార్జీల విధానమే కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు.

నేడు అన్ని జిల్లాల్లో పీఎంకే కార్యవర్గ సమావేశం

● రాందాస్ ప్రకటన

ప్యారీస్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పీఎంకే కార్యవర్గ సమావేశం శనివారం జరుగుతుందని ఆ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో, రాష్ట్రంలోని 234 శాసనసభ నియోజకవర్గాల్లో పార్టీ పదవుల్లో కొనసాగుతున్న ముఖ్యనేతలు, కార్యవర్గ సమావేశం నిర్వహించేందుకు నియమితులైన వారు, పలు విభాగాల సభ్యులను కలుపుని సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశం ద్వారా పార్టీ అభివృద్ధి, అనుబంధ సంస్థల పనితీరు, అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధపడటం తదితర అంశాల గురించి చర్చించనున్నట్లు రాందాస్ తెలిపారు.

పేర్నాంబట్టు చెక్‌పోస్టు వద్ద కర్ణాటక మద్యం స్వాధీనం



వేలూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తం నియోజకవర్గ పరిధిలోని బద్దలపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు సీఐ ప్రభు నేతృత్వంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టగా, కర్ణాటక రిజిస్ట్రేషన్‌తో ఉన్న కారు అటువైపు వచ్చింది. అందులో పది బస్తాల ఖైనీ సహా నిషేధిత పొగాకు ఉత్పత్తులున్నాయి. పోలీసులు తనిఖీ చేస్తుండగానే డ్రైవర్ వాహనాన్ని వేగంగా తీసుకెళ్లాడు. దాంతో పోలీసులు చాలా దూరం వెంబడించి కారును అడ్డుకుని మొత్తం తనిఖీ చేయగా 3 వేలకు పైగా బ్రాందీ ప్యాకెట్లు, కొన్ని బాటిళ్లు బయల్పడ్డాయి. దాంతో ఆ మద్యం స్వాధీనం చేసుకున్న పోలీసులు. కారు డ్రైవర్ ప్రసన్నను అరెస్టు చేశారు.

వేర్పాటువాదానికి సీఎం ప్రోత్సాహం

● బీజేపీ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్


నయినార్ నాగేంద్రన్‌ను సత్కరిస్తున్న స్థానిక నాయకులు

చెన్నై, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బిహార్ ఎన్నికల ప్రచార సమయంలో ప్రధాని మోదీ చేసిన ప్రసంగంపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ చేసిన ప్రకటన వేర్పాటువాదాన్ని ప్రోత్సహించేలా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఆరోపించారు. తిరునల్వేలిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో స్టాలిన్ బిహార్ గురించి ఎన్నో అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని, వాటికి బదులిచ్చేలా ప్రధాని మోదీ విమర్శలు చేశారని చెప్పారు. వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే స్టాలిన్ ఈ రీతిలో ప్రకటనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.. నగరపాలక శాఖలో లంచాలు పుచ్చుకుని ఉద్యోగాలిచ్చారని, డీజీపీ కార్యాలయంలో ఈడీ అధికారులు చేసిన ఫిర్యాదు గురించి గానీ, అవినీతికి పాల్పడిన మంత్రి నెహ్రూ గురించి గానీ ఇప్పటివరకూ స్టాలిన్ నోరు మెదపకపోవడం గర్హనీయమన్నారు.

ఆలపాక్కం పాఠశాలలో నూతన తరగతి గదులు ప్రారంభం



చెన్నై, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య, ప్రభుత్వ రంగ సంస్థలకు సేవలందిస్తున్న గ్లోబల్ కన్సల్టింగ్, టెక్నాలజీ, సేవల నిర్వాహణా సంస్థ గైడ్ హౌస్' ఆలపాక్కం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా మూడు తరగతి గదులు నిర్మించింది. ఆ గదులను గైడ్ హౌస్ ఛైర్మన్ జాన్ సాద్, ఆ సంస్థ భారత భాగస్వామి మహేంద్ర రావత్, ప్రతినిధులు వినయ్ సింగ జస్వంతత్ బంగేరా, నవీన్‌కుమార్ బాలచంద్రన్, సాజి జచారియా, శివశంకరి శంకరన్, అరుల్ సాజిన్ తదితరులు శుక్రవారం ప్రారంభించారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 746 మంది బాలురు, 493 మంది బాలికల సహా 1,239 మంది విద్యార్థులున్నారు. అదే విధంగా 31 మంది మహిళా టీచర్లు, పదిమంది ఉపాధ్యాయులున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు మరి కొన్ని తరగతి గదులు అవసరమని తెలియడంతో గైడ్‌హౌస్ సంస్థ నిర్వాహకులు స్పందించి, వాటిని నిర్మించడం విశేషం.

ఇందిరా గాంధీకి ఘన నివాళి



ఇందిరమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కౌన్సిలర్ ఎంఎస్ ద్రవ్యం, చిరంజీవి తదితరులు

ప్యారీస్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశ తొలి మహిళా ప్రధాని 'భారతరత్న' గ్రహీత ఇందిరా గాంధీ 41వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో ఆమె చిత్రపటానికి కాంగ్రెస్ శ్రేణులు నివాళులర్పించారు. అనంతరం టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై నేతృత్వంలో ఆ పార్టీ ప్రముఖులు తీవ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీలు కృష్ణస్వామి, పీటర్ అల్ఫోన్స్, పార్లమెంట్ సభ్యులు రాబర్ట్ బ్రూస్, ఎస్‌ఏ వాసు, కౌన్సిలర్ ఢిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సెల్వపెరుంతగై మాట్లాడుతూ భారతదేశ ఉక్కు మహిళగా పేరొందిన దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీని ప్రతి ఒక్కరు స్మరించుకోవాలన్నారు. 1999లో బీసీసీ ఆన్‌లైన్ పోల్‌లో 'ఉమెన్ ఆఫ్ మిలీనియం'గా ఇందిరమ్మ గుర్తింపు పొందారని కృష్ణస్వామి పేర్కొన్నారు. అదేవిధంగా ఉత్తర చెన్నై జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కౌన్సిలర్ ఎంఎస్ ద్రవ్యం అధ్యక్షతన వాషర్‌మెన్‌పేటలో ఉన్న ఇందిరమ్మ విగ్రహం వద్ద సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) సభ్యుడు కె.చిరంజీవి, కౌన్సిలర్ ఎ.తీర్థి, ఎస్సీ రాష్ట్ర అధ్యక్షుడు రంజన్‌కుమార్, కౌన్సిలర్ సుకన్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సమస్యల పరిష్కార సమావేశం


జలకంఠేశ్వరాలయంలో నిలిచిన వర్షపునీటిని పరిశీలిస్తున్న కలెక్టర్

వేలూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లాలోని మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల సమస్యల పరిష్కార సమావేశం శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. మాజీ సైనికుల సంఘం వేలూరు జిల్లా ఉపాధ్యక్షుడు దురై రాజ్, అసిస్టెంట్ డైరెక్టర్ పళనివేల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. **జలకంఠేశ్వరాలయంలో కలెక్టర్ తనిఖీ:** వేలూరు కోటలో వున్న జలకంఠేశ్వరాలయాన్ని జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి శుక్రవారం తనిఖీ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆలయంలోకి నీరు ప్రవేశించింది. ఈ విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్... ఎమ్మెల్యే కార్తికేయన్, కార్పొరేషన్ మేయర్ సుజాత తదితరులతో కలిసి ఆలయం లోపలికి వెళ్లారు. వర్షపునీరు నిలిచిపోకుండా చేపట్టాల్సిన చర్యలను అధికారులకు సూచించారు.

పళ్లికరణై చిత్తడిభూముల్లో నిర్మాణాలకు బ్రేక్

● స్టే ఇచ్చిన హైకోర్టు


పళ్లికరణైలోని చిత్తడి భూములు

చెన్నై, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక పళ్లికరణై చిత్తడి నేలలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టకూడదంటూ హైకోర్టు స్టే ఉత్తర్వు విధించింది. పళ్లికరణై చిత్తడి నేలల్లో నివాసగృహ సముదాయాలు నిర్మించేందుకు సీఎండీఏ అనుమతించడం వివాదాస్పదంగా మారింది. ఈ విషయమై పలు రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు వ్యతిరేకతించాయి. అదే సమయంలో పళ్లికరణై చిత్తడి నేలల్లో కట్టడాలు కట్టేందుకు అనుమతించలేదని, ఆ ప్రాంతానికి చేరువుగా ప్రైవేటు భూముల్లో మాత్రమే నిర్మాణాలకు అనుమతిచ్చినట్లు ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఈ విషయమై అన్నాడీఎంకేకు చెందిన ఓ నేత హైకోర్టులో పిటిషన్ వేశారు. పళ్లికరణై చిత్తడి నేలల్లో ఎలాంటి నిర్మాణాలు జరగకుండా స్టే విధించాలని ఆ పిటిషన్‌లో కోరారు. వలస పక్షులకు ఆశ్రయం కల్పిస్తూ, పర్యావరణానికి మేలు కలిగిస్తున్న పళ్లికరణై చిత్తడి నేలల్లో ఎలాంటి కట్టడాలు కట్టకూడదని పేర్కొన్నారు. అంతే కాకుండా కేంద్ర ప్రభుత్వం సురక్షిత ప్రాంతంగా ప్రకటించబడిన ఈ చిత్తడి నేలలో రాష్ట్ర ప్రభుత్వం భవనాలను నిర్మించేందుకు అనుమతిస్తోందని పిటిషనర్ ఆరోపించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి శ్రీవత్సవ, న్యాయమూర్తి అరుళ్ మురుగన్‌తో కూడిన ధర్మాసనం పళ్లికరణై చిత్తడినేలల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని స్టే ఇచ్చింది.

మాదకద్రవ్యాలపై అవగాహన ర్యాలీ


అవగాహన ర్యాలీలో విద్యార్థులు

తిరుత్తణి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని సెయింట్ మేరీస్ మెట్రిక్యులేషన్ పాఠశాల లో శుక్రవారం ఉదయం మాదకద్రవ్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథిగా తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ పాల్గొన్నారు. విద్యార్థులు, పాఠశాల నిర్వాహకులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్కేపేట మద్యపాన నిషేధం ఇన్‌స్పెక్టర్లు సురేష్, జ్ఞానశేఖర్, పాఠశాల సుపీరియర్ ఫ్రాన్సిస్కు, ప్రిన్సిపల్ ప్రేమ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ తంగమారి, ఉపాధ్యాయులు విశ్వనాథం, రజిని, కార్తికేయన్, పళని, శ్రీదేవి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న బస్సు

● మహిళ మృతి, 11 మంది పిల్లలకు గాయాలు


ప్రమాదంలో ధ్వంసమైన ఆటో, రవాణా సంస్థ బస్సు

చెన్నై, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా నత్తం సమీపంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా 11 మంది స్కూలు పిల్లలు గాయపడ్డారు. దిండుగల్ ప్రభుత్వ ఉన్న త పాఠశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు తమ పాఠశాలలో జరిగే గణిత పోటీలకు ఆటోలో బయలుదేరారు. ఆ ఆటో సముద్రపట్టి వద్ద వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణించిన నైనమ్మాళ్ (43) దివ్యశ్రీ, గుహన్, చారుమతి, మౌనిక, హరిణిశ్రీ, రియోరాజ్ , భూమికా, కోకిలా, తిరుప్పతి, సాహుల్ హమదీద్, ఆటో డ్రైవర్ చంద్రన్ గాయపడ్డారు. వారిలో చికిత్స పొందుతూ నైనమ్మాల్ మృతి చెందారు.

పెళ్లింట విషాదం

● బాత్రూమ్‌లో పెళ్లికూతురి అనుమానాస్పద మృతి


మృతురాలు సంధ్య (ఫైల్‌ఫోటో)

తిరుత్తణి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పెళ్లిపీటలెక్కాల్సిన ఓ యువతి బాత్రూమ్‌లో అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని అత్తిమాంజేరిపేటలో చోటుచేసుకుంది. వివరాలిలా.. అత్తిమాంజేరిపేటకు చెందిన సంధ్య (23)అనే యువతికి ఆ గ్రామంలో నివసిస్తున్న రాముమణికి శుక్రవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ చిత్తూరులోని బలిజ కండ్రిగలోని టీటీడీ కళ్యాణ మండపంలో వివాహం జరగాల్సివుంది. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం వరుడి ఇంట్లో మ్యారేజ్ రిసెప్షన్‌కు వారిపెద్దలు ఏర్పాట్లు చేయగా, రిసెప్షన్‌కు రెడీ అవుతానని చెప్పి బాత్రూమ్‌కు వెళ్లిన సంధ్య ఎంతసేపటికీ బయటికి రాకపోవడంతో తలుపులు పగులగొట్టి చూడగా, సంధ్య స్పృహ కోల్పోయి పడివుంది. వెంటనే ఆమె బంధువులు ఆస్పత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆస్పత్రికి చేరుకున్న పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

నకిలీ ప్రకటనలపై మోసపోవద్దు

● ఐబీపీఎస్ ప్రకటన

ప్యారీస్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఉద్యోగాలకు ఎంపిక చేస్తున్నట్లు నకిలీ ప్రకటనలను నమ్మిమోసపోవద్దని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనెల్ సెక్షన్ (ఐబీపీఎస్) హెచ్చరించింది. జాతీయ బ్యాంకులు, పబ్లిక్ బ్యాంకుల్లో ఖాళీ పోస్టులను రాతపరీక్షల ద్వారా ఐబీపీఎస్ భర్తీ చేస్తుంటుంది. ఈ నేపథ్యంలో కొంతమంది సంఘ విద్రోహులు, ప్రైవేటు సంస్థలు ఐబీపీఎస్‌తో ఒప్పందం కుదుర్చుకుని బ్యాంకులకు ఉద్యోగులను ఎంపిక చేస్తున్నట్లు నకిలీ సోషల్ మీడియాలో ప్రకటనలు విడుదలవుతున్నాయి. ఈప్రకటనలను నిమ్మ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత మోసం పోతున్న నేపథ్యంలో ఐబీపీఎస్ ఈ మేరకు హెచ్చరికలు జారీచేసింది.

ఎన్నూరు తీరానికి మహిళల మృతదేహాలు!

చెన్నై, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నూరు పెరియకుప్పం సముద్రతీరానికి ఓ కాలేజీ విద్యార్థిని సహా నలుగురి మహిళల మృతదేహాలు శుక్రవారం మధ్యాహ్నం కొట్టుకువచ్చాయి. అలల మధ్య చిక్కుకున్న గుమ్మిడిపూండి శ్రీలంక శరణార్థుల శిబిరానికి చెందిన కాలేజీ విద్యార్థిని కాపాడేందుకు ముగ్గురు మహిళలు ప్రయత్నించారు. ఆ ప్రయత్నంలో నలుగురూ నీటమునిగి మృత్యువాత పడ్డారు.ఆ నలుగురి మృతదేహాల కోసం పోలీసులు ముమ్మరంగా గాలించారు. ఆ నేపథ్యంలో పెరియకుప్పం సముద్రతీరానికి కాలేజీ విద్యార్థిని శాలిని, దేవకీ సెల్వం, భవానీ, గాయత్రి మృతదేహాలు కొట్టుకువచ్చాయి. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు.

తాకట్టు నగలు విక్రయించిన యువకుడి అరెస్ట్

ప్యారీస్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడులో ప్రజలు తాకట్టు పెట్టిన నగలు విక్రయించి స్నేహితుడితో కలిసి మద్యం సేవించిన యువకుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. కోయంబేడు సరస్వతినగర్‌లో ఓ ఇల్లు అద్దెకు తీసుకున్న రాజస్థాన్‌కు చెందిన గగన్‌రామ్ (55) తన కుటుంబ సభ్యులతో నివసిస్తూ నగల తాకట్టు దుకాణం నడుపుతున్నారు. అనారోగ్యంతో ఇటీవల ఆయన మరణించడంతో కుమారుడు సునీల్ దుకాణం బాధ్యతలు స్వీకరించాడు. గత నెల 8వ తేదీ ఆ దుకాణానికి తాళం వేసి వుండడం గమనించి స్థానికులు అక్కడికి చేరుకుని సునీల్ గురించి ఆ ఇంటి యజమానిని ప్రశ్నించారు. సునీల్ తన కుటుంబంతో కలిసి రాజస్థాన్‌కు పరారైనట్లు తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సునీల్ కోసం గాలింపు చర్యలు చేపట్టిన నేపథ్యంలో, అతను వలసరవాక్కంలోని ఓ బంధువు ఇంట్లో ఉన్నట్లు సమాచారం అందింది. వెంటనే గురువారం రాత్రి అక్కడికి చేరుకున్న పోలీసులు స్నేహితులతో మద్యం సేవిస్తున్న సునీల్‌ను అరెస్ట్ చేశారు. అతడిని విచారణ జరిపిన అనంతరం పోలీసులు మీడియాతో మాట్లాడుతూ, కోయంబేడు ప్రజలు సుమారు రూ.1.5కోట్ల విలువైన రెండు కిలోల నగలు తాకట్టు పెట్టారని, సునీల్ వాటిని విక్రయించి స్నేహితులతో సరదాగా గడుపుతున్నట్లు తెలిపారు. నగలు ఎక్కడెక్కడ విక్రయించాడన్న దానిపై విచారణ జరిపి స్వాధీనం చేసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్‌పీఎఫ్ జవాన్‌పై దాడి

ప్యారీస్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్యారీస్ ప్రాంతంలో ఓ చోరీ కేసు విచారించేందుకు వెళ్లిన ఆర్‌పీఎఫ్ జవాన్‌పై దాడికి పాల్పడిన సెల్‌ఫోన్ దుకాణం సిబ్బందిని పోలీసులు అరెస్ట్ చేశారు. పలు ప్రాంతాల నుండి సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు వస్తున్న ప్రయాణికుల సెల్‌ఫోన్లను చోరీ చేస్తున్న ముఠా వాటిని ప్యారీస్ ప్రాంతంలోని సెల్‌ఫోన్ దుకాణాల్లో విక్రయిస్తుంటారు. ఆవిధంగా సెల్‌ఫోన్‌ను కోల్పోయిన రైలు ప్రయాణికులు అందజేసిన ఫిర్యాదు మేరకు ఆర్‌పీఎఫ్ జవాన్ బినాయ్ గురువారం సంబంధిత సెల్‌ఫోన్ దుకాణంలో విచారణ జరిపేందుకు వెళ్లాడు. అప్పుడు ఆ దుకాణం సిబ్బంది ఆర్‌పీఎఫ్ జవాన్ మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఆ షాపు సిబ్బంది ఆర్‌పీఎఫ్ జవాన్‌పై దాడికి పాల్పడటంతో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై అందజేసిన ఫర్యాదు మేరకు తిరువొత్తియూర్ సెల్‌ఫోన్ దుకాణం యజమాని చెంద్రూ (21)ని అరెస్ట్ చేసిన పోలీసులు శుక్రవారం జార్జిటౌన్ కోర్టులో హాజరుపరిచారు.

పెరంబూర్ రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

ప్యారీస్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి వస్తున్న రైలులో పెరంబూర్ రైల్వేస్టేషన్‌కు తరలించిన 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. దక్షిణ చెన్నై పశ్చిమ జిల్లా జాయింట్ పోలీసు కమిషనర్ నిషా మిట్టల్ ఆదేశాల మేరకు అన్నానగర్ ఎక్సైజ్ పోలీసులు గురువారం సాయంత్రం మారువేషాలతో పెరంబూర్ రైల్వేస్టేషన్‌లో నిఘా వేశారు. ఆ సమయంలో ఒడిశా నుంచి వచ్చిన ఎక్స్‌ప్రెస్‌లో దిగిన ఓ యువకుడిని అనుమానంతో అదుపులోకి తీసుకుని అతడి బ్యాగు తనిఖీ చేసి 10కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గంజాయిని తరలిస్తున్న ఒడిశాకు చెందిన షమీకాంత్ (32)ను అరెస్ట్ చేసి ఎగ్మూర్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఎన్నికలకు టీవీకే సన్నాహం

● 20 మంది ఇన్‌ఛార్జీల నియామకం

ప్యారీస్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ పార్టీ నిర్వహణ సౌలభ్యం కోసం 20 మంది ఇన్‌ఛార్జులను నియమించారు. అసెంబ్లీలోని 234 నియోజకవర్గాలను 10 మండలాలుగా విభజించి ఒక్కొక్క మండలానికి ఇద్దరి చొప్పున నియిమించిన 20 మందితో త్వరలో సమావేశం కానున్నారు. కరూర్ దుర్ఘటన అనంతరం విజయ్ పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా తొలి విడతగా 28 మంది కార్యవర్గ సభ్యులను నియమించి వారితో సమావేశమైయ్యారు. నవంబర్ 5వ తేదీ ప్రత్యేక కార్యవర్గ సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఇదిలా వుండగా వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం విజయ్ సమాయత్తమవుతున్నారు. పార్టీ తరుపున బూత్ కమిటీల నియామకం, చేపట్టాల్సిన ప్రచారం తదితర పనులకు 20 మంది ఇన్‌ఛార్జులను నియమించారు. ఎన్నికల సమయంలో వీరు పార్టీ ప్రచారకర్తలు, విజయ్ పర్యటించే ప్రాంతాల్లో ఏర్పాట్లను సిద్ధం చేయనున్నారు. అదేవిధంగా బూత్ కమిటీలను పటిష్టం చేసే బాధ్యతలను కూడా వీరికి పార్టీ అధిష్టానం అప్పగించినట్లు సమాచారం.

ముమ్మరంగా రోగ నిరోధక చర్యలు

● తగ్గిన డెంగ్యూ, మలేరియా జ్వరాలు

● మంత్రి సుబ్రమణ్యం

చెన్నై, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవన ప్రభావిత వర్షాల కారణంగా వ్యాపించే వ్యాధులను సక్రమంగా నిరోధించడంతో రాష్ట్రవ్యాప్తంగా డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా జ్వరాలు తగ్గుముఖం పట్టాయని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం ఉదయం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించి 15 రోజులు గడిచాయని, ఇటీవల కురిసిన వర్షాలకు మలేరియా జ్వరాలు అధికంగా వ్యాపించాయని తెలిపారు. అయితే ఆరంభంలోనే పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది తక్షణ వైద్య సేవలందించారని చెప్పారు. ఈ యేడాది రాష్ట్రంలో 18 వేల మందికిపైగా డెంగ్యూ జ్వరాలు వ్యాపించాయని, సకాలంలో బాధితులకు మెరుగైన చికిత్సలందించామని ఆయన వివరించారు.

వరుస హిట్లతో అనుపమ ఖుషీ

చిత్రజ్యోతి



అనుపమ పరమేశ్వరన్

సాధారణంగా హీరోయిన్‌కు ఒక చిత్ర విజయం లభిస్తేనే ఎంతో సంబరపడిపోతారు. అలాంటిది ఒకే సారి రెండు హిట్లు తమ ఖాతాలో చేరితే ఇక ఆమె ఆనందానికి హద్దులు ఉండవు. అలాంటి సంతోషాన్ని మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ అనుభవిస్తున్నారు. ఈ దీపావళికి ఆమె హీరోయిన్‌గా నటించిన రెండు చిత్రాలు విడుదలై విజయాన్ని సొంతం చేసుకున్నాయి. వాటిలో ఒకటి 'డ్రాగన్' కాగా రెండోది 'బైసన్'. ఈ సినిమాల కలెక్షన్ల సంగతి అటుంచితే ఈ సినిమాల్లో అనుపమ నటనకు మంచి మార్కులతో పాటు ప్రశంసలు దక్కాయి. 2015లో చిత్రపరిశ్రమకు పరిచయమైన అనుపమ... తమిళంలో మాత్రం ఒక్క హిట్ కూడా లేదు. ఈ విజయం కోసం ఎంతోకాలంగా ఆమె పరితపిస్తున్నారు. చివరకు గత దీపావళి ఆమెకు రెట్టింపు సంతోషాన్ని ఇచ్చింది.

ఆల్కహాల్‌కు ప్రచారం చేయలేదనే కేసు



'బ్రో కోడ్'లో యోగిబాబు - రవి మోహన్

● రవి మోహన్

'బ్రో కోడ్' పేరుతో తయారయ్యే మద్యానికి తన చిత్రంలో ప్రచారం కల్పించలేదన్న అక్కసుతోనే సంబంధిత లిక్కర్ కంపెనీ తమపై కేసు పెట్టిందని హీరో రవి మోహన్ ఆరోపించారు. ఈ విషయంపై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'స్వీయ దర్శకత్వంలో తెరకెక్కే 'బ్రో కోడ్' మూవీలో ఇదే పేరుతో మద్యం తయారు చేసే ఆల్కహాల్ బ్రాండ్లను ప్రమోట్ చేయాలని తమపై ఒత్తిడి చేయగా అందుకు మేం తిరస్కరించడం జరిగింది. లిక్కర్ కంపెనీ ఒత్తిడి మేరకు మద్యం బ్రాండ్లను సినిమాలో ప్రచారం చేస్తే తప్పుడు సంకేతాలు వెళ్తాయి. అందుకే మేము అంగీకరించలేదు. ఏది ఏమైనా ఈ నెల 21న మంచి తీర్పు వస్తుందని ఆశిస్తున్నాం' అని వివరించారు. కాగా, తన సొంత నిర్మాణ సంస్థపై 'బ్రో కోడ్' మూవీని రవి మోహన్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహించిన విషయం తెల్సిందే. ఈ చిత్ర టైటిల్‌కు లిక్కర్ కంపెనీ అభ్యంతరం వ్యక్తం చేసి, మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా చుక్కెదురైంది. దీంతో ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేయగా, దీనిపై విచారించిన కోర్టు.. 'బ్రో కోడ్' టైటిల్ ఉపయోగించకుండా తాత్కాలిక స్టే విధించింది.

నూతన దర్శకుడితో విక్రమ్





హీరో చియాన్ విక్రమ్ మరో కొత్త దర్శకుడికి అవకాశం ఇచ్చారు. ఇప్పటివరకు కేవలం మూడు లఘు చిత్రాలను మాత్రమే రూపొందించిన బోడి కె.రాజ్‌కుమార్ దర్శకత్వంలో నటించేందుకు చియాన్ అంగీకరించారు. నిరంతరం కొత్తదనం కోసం పరితపించే చియాన్.. తన 63వ చిత్రానికి దర్శకత్వ బాధ్యతలను డెబ్యూ డైరెక్టర్‌కు అప్పగించడం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రాజెక్టును శాంతి టాకీస్ నిర్మించనుంది. కాగా, విక్రమ్ చివరగా 'వీర ధీర శూరన్' చిత్రంలో నటించారు. 63 చిత్రాన్ని 'మండేలా' ఫేం మడోన్ అశ్విన్ ప్రారంభించారు. కొద్ది రోజుల పాటు చిత్రీకరణ కూడా జరిగినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. చివరకు ఏమైందోగానీ ఈ ప్రాజెక్టు అర్థాంతరంగా నిలిచిపోయింది. ఇపుడు ఈ ప్రాజెక్టు తిరిగి పట్టాలెక్కనుంది. బోడి కె.రాజ్‌కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించే బాధ్యతలను స్వీకరించారు.

ఓ ఇంటివాడైన 'టూరిస్ట్ ఫ్యామిలీ' డైరెక్టర్



వధువు నుదుట తిలకధారణ

'టూరిస్ట్ ఫ్యామిలీ' దర్శకుడు అభిషన్ జీవంత్ ఓ ఇంటివాడయ్యారు. తన ప్రియురాలు అఖిలను శుక్రవారం వివాహం చేసుకున్నారు. ఆయన దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'టూరిస్ట్ ఫ్యామిలీ' బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. అతి తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కి ఏకంగా రూ.100 కోట్లకు పైగా వసూళ్ళను రాబట్టింది. ఈ విజయంతో అభిషన్ కోలీవుడ్ హిట్ యంగ్ దర్శకుల జాబితాలో చోటు దక్కించుకోవడంతో పాటు సూపర్‌స్టార్ రజనీకాంత్ వంటి అగ్రనటుల ప్రశంసలు కూడా పొందారు. ఈ నేపథ్యంలో తన చిన్ననాటి ప్రియురాలు అఖిలను శుక్రవారం వివాహం చేసుకున్నారు. స్థానిక పోయెస్ గార్డెన్‌లో వీరిద్దరి వివాహం ఇరు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అతికొద్దిమంది సినీ ప్రముఖుల సమక్షంలో కోలాహలంగా జరిగింది.



ప్రపంచ పౌరులుగా మారితే

దేశ రాజకీయ సరిహద్దులు ఆపలేవు

● వీఐటీ ఉపాధ్యక్షుడు శేఖర్ విశ్వనాథన్

వేలూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నిజమైన ప్రపంచ పౌరులుగా మారితే దేశ రాజకీయ సరిహద్దులు మనల్ని ఆపలేవని వీఐటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ శేఖర్ విశ్వనాథన్ పేర్కొన్నారు. సెంటర్ ఫర్ బయో సెపరేషన్స్ టెక్నాలజీ (సీబీఎస్‌టీ), ది స్కూల్ ఆఫ్ బయో సైన్సెస్ అండ్ టెక్నాలజీ (ఎస్‌బీఎస్‌టీ), ది ఇంటర్నేషనల్ రిలేషన్స్ (ఐఆర్) కార్యాలయం నిర్వహించిన ఫ్రాంకో-ఇండియన్ క్యాంపస్ (ఐఎల్ఐఏడీఈ) కన్సార్టియం నేతృత్వంలో ఎంఎస్‌సీ బయోటెక్నాలజీ ప్రోగ్రామ్ కోసం డిగ్రీ ప్రదానోత్సవం శుక్రవారం వేలూరు ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి పుదుచ్చేరి-చెన్నైలోని ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ ఏటీఎస్ రోలాండ్ పీగ్ ముఖ్య అతిథిగా, రాష్ట్ర ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగ మాజీ కార్యదర్శి ప్రొఫెసర్ టి.రామస్వామి గౌరవ అతిథిగా హాజరై, పట్టభద్రులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ శేఖర్ విశ్వనాథన్ మాట్లాడుతూ.. ఇండో-ఫ్రెంచ్ మధ్య దృఢమైన బంధం వుందన్నారు. డిగ్రీలు పొందిన గ్రాడ్యుయేట్లు బయటకు వెళ్లి సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు కొత్త పరిష్కారాలు కనుగొంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. రోలాండ్ పీగ్ మాట్లాడుతూ.. గత 40 సంవత్సరాలుగా వీఐటీ సాధించిన విజయాలను చూసి తాను ముగ్ధుడినయ్యానని తెలిపారు. ఇంజనీరింగ్, సైన్స్‌లో అగ్రగామిగా వున్న అత్యున్నత స్థాయి ప్రైవేటు సంస్థ సృష్టించడం సామాన్యమైన విషయం కాదన్నారు. ఫ్రాన్స్-భారత్ మధ్య మూడు శతాబ్దాలకు పైగా సంబంధాలున్నాయని, ఫ్రాన్స్ ఎల్లప్పుడూ భారత్‌కు మద్దతుగా వుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఈడీ డాక్టర్ సంధ్య పెంటారెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ కాంచనా భాస్కరన్, రిజిస్ట్రార్ జయభారతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిపరాశక్తి ఆలయ కుంభాభిషేకం



అమ్మవారి సన్నిధిలో మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

ప్యారీస్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మేల్‌మరువత్తూరు ఆదిపరాశక్తి ఆలయ మహాకుంభాభిషేకం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ ఆలయంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు కలశస్థాపన అనంతరం పవిత్ర జలాల కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.4 రోజుల యాగశాల పూజల అనంతరం శుక్రవారం ఉదయం 8.30గంటలకు పవిత్ర జల కలశాలను ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. అనంతరం ఆదిపరాశక్తి అమ్మవారి ప్రధాన గోపురం, ఇతర సన్నిధులపై పవిత్ర జలాలను సంప్రోక్షించి కుంభాభిషేకాన్ని నిర్వహించారు. ఈ వైభవంలో పాల్గొన్న భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.



సంచార చికిత్సా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సినీ దర్శకురాలు ఐశ్వర్యా రజనీకాంత్

రేలా హాస్పిటల్‌లో మొబైల్ స్ట్రోక్ కేర్ యూనిట్ ప్రారంభం

చెన్నై, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రోంపేటలోని రేలా హాస్పిటల్‌లో శుక్రవారం పక్షవాత రోగులకు వైద్యసేవలందించే నిమిత్తం స్ట్రోక్ మొబైల్ కేర్ యూనిట్ ప్రారంభమైంది. ఈ యూనిట్‌ను ప్రముఖ సినీ దర్శకురాలు ఐశ్వర్యా రజనీకాంత్ ప్రారంభించారు. రేలా హాస్పిటల్ ఛైర్మన్ ప్రొఫెసర్ మహమ్మద్ రేలా, న్యూరాలజీ వైద్యనిపుణుడు డాక్టర్ శంకర్ బాలకృష్ణన్, డాక్టర్ మురళీధరన్ వెట్రివేల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ రేలా మాట్లాడుతూ వైద్యనిపుణులు, సిబ్బందితో ఉన్న ఈ సంచార చికిత్సా కేంద్రం పక్షవాతం వచ్చినవారి వద్దకు వీలైనంత త్వరగా వెళ్ళి చికిత్స అందించి సకాలంలో ప్రాణ గండం నుండి తప్పిస్తుందని పేర్కొన్నారు.

తరుణి



ఒకప్పుడు స్త్రీలకు చదువు అక్కరలేదని, చాకలి పద్దు రాయడం వస్తేచాలనేవారు. మనసులో చదువుకోవాలన్న ఆకాంక్ష ఉన్నా, సమాజానికి తలొగ్గి చదువుకు స్వస్తిపలికింది ఆనాటి స్త్రీ. కొన్ని దశాబ్దాల క్రితం వరకు ప్రాథమిక పాఠశాల విద్య పూర్తయిన వెంటనే బాలికలకు వివాహం చేసేవారు. 'వివాహం విద్యనాశీయ' అన్నట్లు వివాహంతో ఇంటి బాధ్యతల్లో తలమునకలై, చదువుకోవాలన్న కోరిక ఉన్నా, అది అడుగంటి పోయేది. కానీ అదే పరిస్థితుల్లో కొనసాగుతూ కూడా చదుపై ఇష్టంతో, కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూనే పై చదువులు చదివిన మహిళలు కూడా ఉన్నారు. అలాంటివారిలో ఒకరు చెన్నైకి చెందిన డాక్టర్ వసుంధర.

- వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి



ఆత్మవిశ్వాసంతో ఏదైనా సాధ్యం
ఆసక్తి ఉంటే విజయం సుగమం

● విద్యకు వయోభేదం లేదని నిరూపిస్తున్న డాక్టర్ సి.వసుంధర

దృఢ సంకల్పం, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే ఏదైనా సాధ్యమేనని నిరూపించారు వసుంధర. విద్యాభ్యాసానికి వయోపరిమితి లేదని, వివాహం విద్యకు ఆటంకం కాదని, గమ్యంలో ఎన్ని అవరోధాలున్నా, లక్ష్యం చేరుకోవాలనే తపన ఉంటే తప్పక విజయం సొంతమవుతుందని స్వానుభవంతో ఉదారణగా నిలిచారు. వసుంధర విద్యా విజయ ప్రస్థానం ఈనాటి 'తరుణి'లో...

నెల్లూరు జిల్లాలోని దువ్వూరు గ్రామంలో వసుంధర జన్మించారు. దువ్వూరు దుర్వాస మహాముని నిర్మించిన గ్రామంగా అక్కడి స్థానికులు చెబుతుంటారని ఆమె తెలిపారు. వసుంధర తల్లి శేషమ్మ, తండ్రి శ్రీహరిరావు. ఆయన గ్రామ కరణం. నాటకాలు వేసేవారు. సంగీతానుభవం కూడా ఉంది. తల్లి భారత, భాగవత పద్యాలు పల్లెలోని స్త్రీలకు నేర్పించేవారు. వసుంధరకు బాల్యం నుంచి చదువంటే ఎంతో ఇష్టం. అయితే తన తండ్రి కరణంగా పనిచేస్తున్న ఆ గ్రామంలోని పాఠశాలలో 5వ తరగతి వరకే ఉంది. వసుంధర 5వ తరగతి పూర్తికాగానే తల్లిదండ్రులు ఆమె చదువుకు స్వస్తిపలికించారు. పైవూరు వెళ్లి చదువుకోవాలనే ఆశక్తి ఉన్నా, ఆనాటి పరిస్థితుల దృష్ట్యా ఆమెను ఇంటికే పరిమితం చేశారు. ఇంటి దగ్గరే హార్మోనియం, గాత్ర సంగీతంలో శిక్షణ ఇప్పించారు. వసుంధరకు 15వ ఏట వివాహం జరిగింది. ఆమె భర్త డాక్టర్ సివి.రామచంద్రరావు. నెల్లూరులోని వీఆర్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు.

ఉద్యోగ జీవితం....

చదువులో ఒకస్థాయికి చేరుకున్న వసుంధర నెల్లూరులోని వేణుగోపాలస్వామి కాలేజీలో తెలుగు అధ్యాపకురాలిగా చేరడంతో ఆమె ఉద్యోగప్రస్థానం ప్రారంభమైంది. "కళాప్రపూర్ణ డాక్టర్ మరవూరు కోదండరామిరెడ్డిగారి జీవితం, సాహిత్యం" అనే అంశంపైన పరిశోధన చేసి పీహెచ్‌డీ సాధించారు. "ఒకవైపు సంసార బాధ్యతలు, ఉమ్మడి కుటుంబం, ముగ్గురు పిల్లలు, మరోవైపు ఉద్యోగ నిర్వహణ, చదువు ఇవన్నీ సమర్థవంతంగా నిర్వహించగలగడం నా జీవనప్రస్థానంలో సాధించిన చిన్న విజయాలు" అని వసుంధర పేర్కొన్నారు.

సాహిత్యంతో సాన్నిహిత్యం.....

తన జీవన సహచరుడైన రామచంద్రరావుకి కూడా సాహిత్యాభిలాష ఉండటంతో వారింటికి ఎందరో సాహితీవేత్తలు వచ్చేవారని, డా.అక్కిరాజు రమాపతిరావు, వెలగా వెంకటప్పయ్య వంటి పెద్దలు వారింట్లో ఆతిధ్యం స్వీకరించేవారని వసుంధర తెలిపారు. వసుంధర కవయిత్రి, రచయిత్రి, సమీక్షకురాలు, ఆమె వ్యాసాలు, కథలు ఎన్నో పత్రికల్లో ప్రచురితమయ్యాయి. కొన్నింటికి బహుమతులకు కూడా వచ్చాయి.



సాహిత్య సదస్సులో ప్రసంగిస్తున్న వసుంధర

ఆమె 250కి పైగానే కవితలు రాశారు. కవయిత్రి మొల్ల, వేటూరి ప్రభాకరశాస్త్రి, పుల్లె రామచంద్రుడు వంటి వారి కోసం 'తెలుగు వెలుగు', 'సుపథ'లో వ్యాసాలు రాశారు. అనేక పుస్తక సమీక్షలు చేశారు. స్త్రీలకు సంబంధించిన వివిధ అంశాలపై ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, వనిత తదితర పత్రికల్లో ఆమె రాసిన వ్యాసాలు, కథలు ప్రచురితమయ్యాయి. హోతా పద్మిని రచించిన నవలా సమీక్షకు వసుంధర బహుమతి అందుకున్నారు. 'సహారి' పత్రికలో రాసిన ఆమె కథలు కూడా బహుమతులకు ఎంపికయ్యాయి. ప్రస్తుతం ఆరుద్ర రచించిన 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' పై 'సిరిమల్లె' అనే మాసపత్రికకు (యూఎస్ నుండి వస్తుంది)సంక్షిప్తంగా వ్యాసాలు రాస్తున్నారు.

ఉపన్యాసాలు... : నెల్లూరులో లెక్చరర్‌గా పనిచేస్తున్న కాలంలో అక్కడ సాహిత్య సభల్లో 'మొల్ల రామాయణం', రామాయణంలో పాత్రలు మొదలైన అంశాలపై 20 వరకు ఉపన్యాసాలిచ్చి అందరి ప్రశంసలు అందుకున్నారు వసుంధర. మొల్ల లివ్వడంతో ఆమెను 'నెల్లూరు మొల్ల'గా అందరూ అభినందించడం తన జీవితంలో ఎంతో ఆనందాన్నిచ్చిన సంఘటనగా వసుంధర పేర్కొన్నారు. మొల్లపైన ఎన్నో ఉపన్యాసాలు ఇవ్వడంతో ఆమెను 'నెల్లూరు మొల్ల'గా అందరూ అభినందించడం తన జీవితంలో ఎంతో ఆనందాన్నిచ్చిన సంఘటనగా వసుంధర అన్నారు. ఎనభై యేళ్ల వయసులో అనారోగ్యాన్ని లెక్కచేయకుండా, ఇంకా నిత్యవిద్యార్థినిగా పుస్తక పఠనం, రచనా వ్యాసంగంలో సమయాన్ని సద్వినియోగం చేస్తూ నేటి తరానికి ఒక స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

ప్రస్తుతం చెన్నైలో స్థిర నివాసం ఏర్పరుచుకున్న వసుంధర తరుణితో మాట్లాడుతూ.. సానుకూల దృక్పథం అలవరచుకుంటే జీవితం ఆనందమయం అవుతుందని, ఓటమికి, పరాజయానికి క్రుంగిపోకూడదని, అవి విజయానికి సోపానాలని, ప్రతికూల పరిస్థితులెదురైనా మనస్థైర్యంతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు నడవాలని, అవి మనకు నేర్పిన పాఠాలుగా భావించాలన్నారు.

మరచిపోలేని సంఘటన...

వేటూరి ప్రభాకరశాస్త్రి గురించి రాసిన వ్యాసాన్ని చదివిన ఆయన కుమారులు వేటూరి ఆనందమూర్తి తనకు ప్రత్యేకంగా ఫోన్‌చేసి అభినందించడం ఎప్పటికీ మరచిపోలేని సంఘటన అన్నారు వసుంధర. వంటచేయడం, చదరంగం ఆడటం ఆమెకు ఆనందాన్నిచ్చే అభిరుచులుగా తెలిపారు వసుంధర.

కుటుంబ సభ్యులతో



విద్యా ప్రస్థానం....

చదువులో ముందుకు సాగాలన్న ఆమె బలమైన సంకల్పానికి భర్త ప్రేరణ చేయూతనిచ్చింది. కుటుంబ సభ్యుల సహకారం కూడా తోడైంది. అందరి ప్రోత్సాహంతో 5వ క్లాసుతో ఆగిన చదువు కొనసాగించింది. ఎలాంటి ప్రాథమిక విద్యార్హత లేకున్నా, డైరెక్ట్‌గా పి.యు.సి, బి.ఏ చదివే వెసులుబాటు అప్పట్లో ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఉండేది. పీయూసీ రెండేళ్ల పరీక్షలు ఒకేసారి రాసి విజయం సాధించారు. ఉమ్మడి కుటుంబంలో ఉంటూ, ముగ్గురు పిల్లల తల్లిగా బాధ్యతలు నిర్వహిస్తూ బి.ఏ చదివేందుకు ఉత్సుక్తురాలవడం ఆమెకు చదువుపై గల శ్రద్ధకు, ఆసక్తికి నిలువెత్తు నిదర్శనం. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ నుంచి బి.ఏ, ఎం.ఏ కూడా పూర్తిచేయడం ఆమెకు విద్య పట్ల ఉన్న అంకితభావానికి, నిదర్శనం.

ఉన్నత విద్యలో రాష్ట్రం ప్రథమస్థానం

● మంత్రి కోవి చెళియన్



సచివాలయంలో ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్‌తో సమావేశమైన ఆస్ట్రేలియా మంత్రుల బృందం

ప్యారీస్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని ఆ శాఖమంత్రి కోవి చెళియన్ పేర్కొన్నారు. ఆస్ట్రేలియా విద్యాశాఖ మంత్రి డోనిబుట్టి నేతృత్వంలోని బృందం శుక్రవారం ఉదయం సచివాలయంలో మంత్రి కోవి చెళియన్‌తో సమావేశమై ఉన్నత విద్యారంగంపై చర్చించారు. తమిళనాడు, ఆస్ట్రేలియా మధ్య విద్యారంగంపై కుదుర్చుకున్న ఒప్పందంపై చర్చించారు. మంత్రితో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి శంకర్, చెన్నైలోని ఆస్ట్రేలియా దౌత్యకార్యాలయ రాయబారి జక్కీ, ఆస్ట్రేలియా మంత్రి మార్టినస్, ఉన్నతాధికారులు భేటీ అయ్యారు.

వీఐటీ వ్యవస్థాపకుడికి జీవన సాఫల్య పురస్కారం



వేలూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) వ్యవస్థాపకులు, వర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్‌కు 'ఫెడరేషన్ ఆఫ్ వరల్డ్ అకడమిక్స్' (ఎఫ్‌డబ్ల్యూఏ) జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేసింది. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఎఫ్‌డబ్ల్యూఏ 8వ వార్షికోత్సవం సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి, పద్మవిభూషణ్ డాక్టర్ మురళీమనోహర్ జోషి జీవన సాఫల్య పురస్కారాన్ని విశ్వనాథన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమానికి పలువురు జాతీయ నాయకులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు.



చైనాలో జరిగిన ఆసియా జూనియర్ ఛాంపియన్‌షిప్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో స్వర్ణపతకం గెల్చుకున్న తిరువళ్లూరు జిల్లా క్రీడాకారిణి ఎస్ఆర్ దీక్షకు శుక్రవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రోత్సాహకం రూ.5లక్షల చెక్కు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి. చిత్రంలో క్రీడాభివృద్ధి శాఖ కార్యదర్శి మేఘనాథరెడ్డి తదితరులున్నారు.



సర్దార్ వల్లభభాయ్ జయంతి సందర్భంగా శుక్రవారం రాజ్‌భవన్‌లో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి.

శ్రీరంగంలో వైకుంఠ ఏకాదశి వేడుకలకు శ్రీకారం

● అట్టహాసంగా ముహూర్త స్తంభ స్థాపన

చెన్నై, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): భూలోక వైకుంఠంగా ప్రసిద్ధి గాంచిన శ్రీరంగం రంగనాథస్వామివారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు శ్రీకారం చుడుతూ శుక్రవారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని వేయికాళ్ల మండపం వద్ద ముహూర్త స్తంభ స్థాపన కార్యక్రమం జరిగింది. ఈ ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు డిసెంబర్ 19న తిరునెడుంతాండకంతో ప్రారంభమవుతాయి. వైష్ణవ భట్టాచార్యులు, పండితులు, ఆలయ ప్రధానార్చకులు మంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాల నడుమ ఇరువైపులా ఆలయ ఏనుగులు ఆండాళ్, లక్ష్మి ఘీంకరిస్తుండగా ముహూర్త స్తంభ స్థాపన జరిగింది. ముహూర్త స్తంభాన్ని పవిత్ర జలాలతో సంప్రోక్షించి, దీపారాధన చేసారు. ఈ నేపథ్యంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు సంబంధించి అక్కడ భారీ పందిరి నిర్మించనున్నట్టు ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. డిసెంబర్ 30న ఆలయంలో వైకుంఠ ద్వారా ప్రవేశ మహోత్సవం అట్టహాసంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముహూర్త స్తంభ స్థాపన కార్యక్రమంలో పాల్గొన్న భట్టాచార్యులు, పండితులు, ప్రధానార్చకులు





పోలీసుల సమైక్యతా పరుగు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శుక్రవారం పోలీసు శాఖ ఆధ్వర్యాన సమైక్యతా పరుగు (రన్ ఫర్ యూనిటీ) తీశారు. పోలీసు పరేడ్ మైదానం నుంచి ఎంఆర్‌పల్లె సర్కిల్ వరకు విద్యార్థులు, పోలీసులు, నగర ప్రజలతో ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు పటేల్ చిత్ర పటానికి అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, శ్రీనివాసరావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. దేశమంతా ఒక్కటే అనే భావనను ప్రజల్లో పెంపొందించడమే ఈ ర్యాలీ ఉద్దేశమని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు.

→ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

రుయాలో 152 మందికి షోకాజు నోటీసులు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని రుయాస్పత్రిలో పారిశుధ్యం, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్లో పనిచేసే 152 మందికి సూపరింటెండెంట్ రాధ శుక్రవారం షోకాజు నోటీసులు జారీ చేశారు. వీరు ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం)లో హాజరు సకాలంలో వేయకపోవడాన్ని ఆమె గుర్తించి వారికి నోటీసులు జారీ చేశారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు సకాలంలో వేయని వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు ఆధారంగానే జీతాలు అందుతాయని లేకపోతే ఆ రోజుటి జీతం అందదన్నారు.


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 19 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.48 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 56,078

తలనీలాలు సమర్పించినవారు: 17,539



ముక్కంటికి బంగారు కాసుల దండ వితరణ

శ్రీకాళహస్తి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరస్వామికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన ఇందిర రూ.9.32లక్షల విలువైన 96గ్రాముల బంగారు కాసుల దండ, 650గ్రాముల వెండి బిందెను వితరణ చేశారు. వీటిని ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామిఅమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు.



ఈవో బాపిరెడ్డికి బంగారు కాసుల దండ అందజేస్తున్న ఇందిర

కొండెక్కుతూ.. భజనలు చేస్తూ..

● ఘనంగా శ్రీవారి మెట్లోత్సవం



పాదాల మండపం వద్ద పూజలు నిర్వహిస్తున్న టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుపతి అలిపిరి పాదాల మండపం వద్ద శుక్రవారం శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం ఘనంగా జరిగింది. పాదాల మండపం వద్ద పూజలు చేసి, కర్పూర హారతులిచ్చారు. పూర్వం నుంచీ ఎందరో మహనీయులు మెట్లమార్గంలో తిరుమల వెళ్లారని.. ఇలాంటి మెట్లోత్సవంలో పాల్గొనడం పుణ్యఫలంగా భావిస్తున్నట్లు టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. భజన మండలి సభ్యులతో కలిసి గోవిందనామ భజనలతో సప్తగిరులను అధిరోహిస్తున్నట్లు దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు చెప్పారు. 3,500 మంది భజన మండలి సభ్యులతో కలిసి మెట్ల మార్గం గుండా తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.



భజన మండలి కళాకారులు



అతుల్ సింగ్

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ ఏసీబీ డీజీ అతుల్ సింగ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి

డ్రంకెన్ డ్రైవ్‌లో 41 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 41 మందికి జరిమానా విధిస్తూ తిరుపతి మూడవ అదనపు జ్యుడిషియల్ కోర్టు న్యాయమూర్తి సంధ్యారాణి శుక్రవారం తీర్పు చెప్పారు. ట్రాఫిక్ పోలీసులు నగరంలో తనిఖీలు నిర్వహించి, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న దాదాపు 70 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిలో 41 మందిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ట్రాఫిక్ కు అంతరాయం కలిగించిన 12 మందికి రూ.500 వంతున జరిమానా విధించారు.

గుంపులుగా వెళ్లండి

● శ్రీవారిమెట్టు మార్గంలో మరోసారి చిరుత కలకలం

చంద్రగిరి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురం నుంచి తిరుమలకు కాలినడకన వెళ్లే శ్రీవారిమెట్టు మార్గంలో చిరుత సంచారంతో కలకలం రేగింది. శుక్రవారం ఉదయం 150వ మెట్టు వద్ద అటవీ ప్రాంతంలోకి చిరుత దాటుతుండగా భక్తులు చూసి భయాందోళనకు గురై కేకలు వేయడంతో పారిపోయింది. అనంతరం భక్తులు టీటీడీ సెక్యూరిటీకి సమాచారమిచ్చారు. టీటీడీ సెక్యూరిటీ అప్రమత్తమై భక్తులను గుంపులు గుంపులుగా తిరుమలకు అనుమతించారు. చిన్న పిల్లలను జాగ్రత్తగా తీసుకెళ్లాలని సూచించారు. అటవీ అధికారులు ఆప్రాంతంలో ప్రత్యేక ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసి, పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. గతంలోనూ 2024 సెప్టెంబరులో, ఈ ఏడాది జూన్‌లోనూ ఈ మార్గంలో చిరుత సంచరించింది. ఈనేపథ్యంలో చిన్న పిల్లలున్న భక్తులను మధ్యాహ్నం 2 గంటల వరకే శ్రీవారి మెట్టు మార్గంలో అనుమతిస్తున్నారు. టీటీడీ అధికారులు శ్రీవారిమెట్టు మార్గంలో కాలినడకన తిరుమలకు వెళ్ళే భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకుని, అప్రమత్తంగా ఉండాలంటూ సూచిస్తున్నారు.



మూడు కేసుల్లో ఏడుగురికి

● ఇప్పటిదాకా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉరిశిక్ష విధిస్తూ తీర్పులు



స్వాతంత్ర్యానంతరం ఉమ్మడి చిత్తూరు జిల్లా చరిత్రలో ఒకేసారి ఐదుగురికి ఉరి శిక్ష పడిన ఘటనగా కఠారి మోహన్ దంపతుల కేసు నిలిచిపోతుంది. దీంతో కలిపి ఇప్పటి వరకు మూడు కేసుల్లో ఉరిశిక్ష విధిస్తూ న్యాయమూర్తులు తీర్పులిచ్చారు.

2020 ఫిబ్రవరి 24: కురబలకోట మండలం అంగళ్లులో ఓ పెళ్లికి వచ్చిన ఆరేళ్ల చిన్నారిపై లారీ క్లీనర్ పఠాన్ మహ్మద్ రఫీ(27) అత్యాచారానికి పాల్పడ్డాడు. చిన్నారి మృతి చెందింది. 2019 నవంబరు 7న జరిగిన ఈ ఘటనపై చిత్తూరు కోర్టు ఉరిశిక్ష విధించింది. దీనిని హైకోర్టును జీవిత ఖైదుగా మార్చడంతో నిందితుడు కడప సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు.

2023 ఆగస్టు 22: తంబళ్లపల్లె మండలం ఏటిగడ్డ తాండాకు చెందిన తల్లీ కూతుళ్లతో వివాహేతర సంబంధం పెట్టుకుని హతమార్చడం.. ఓ బాలికపైనా అత్యాచారానికి పాల్పడిన కేసులో మదనపల్లె ఫస్ట్ ఏడీజే కోర్టు మౌలాలికి ఉరిశిక్ష విధించింది. నిందితుడు హైకోర్టుకు అప్పీలు చేయగా విచారణ పెండింగులో ఉంది.

అంత ఈజీ కాదు!

సాధారణంగా జిల్లా కోర్టులు విధించే ఉరిశిక్షలకు హైకోర్టు ఆమోదం తప్పనిసరి. ఆలోపు నిందితులు హైకోర్టుకు అప్పీలు చేసుకోవచ్చు. దీనిపై హైకోర్టు విచారించి మెరిట్స్‌ను బట్టి కింది కోర్టు వేసిన శిక్షను ఖరారు చేయచ్చు. లేదా జీవిత ఖైదుగా మార్చవచ్చు. మెరిట్స్ లేవని భావిస్తే శిక్షనే రద్దు చేయచ్చు. ఒకవేళ హైకోర్టు కూడా కింది కోర్టు తీర్పునే ఖరారు చేస్తే నిందితులకు సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశముంది. అంతిమంగా సుప్రీంకోర్టు కూడా ఉరిశిక్షను ఖరారు చేస్తే నిందితులకు మిగిలిన ఏకైక అవకాశం రాష్ట్రపతికి క్షమాభిక్ష పిటిషన్ పెట్టుకోవడమే. రాష్ట్రపతి కరుణించి శిక్షను రద్దు చేయడం లేదా, తీవ్రతను తగ్గించే నిర్ణయం తీసుకోవచ్చు. లేదా క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించనూ వచ్చు. అలా తిరస్కరిస్తే నిందితులకు అన్ని దారులూ మూసుకుపోయినట్లే.

ఉరిశిక్ష పడిన నేరస్తులు సెంట్రల్ జైలుకే

రాష్ట్రంలో ఏ కోర్టు ఉరిశిక్ష వేసినా నేరస్తులను నెల్లూరు, కడప, రాజమండ్రి, విశాఖల్లోని ఏదేని ఒక సెంట్రల్ జైలుకు పంపిస్తారు. ఉరిశిక్ష అమలయ్యే దాకా లేదా పైకోర్టులు ఆ శిక్షను రద్దు చేయడం లేదా మార్చడం చేసే దాకా అక్కడే ఉంచుతారు.

ఉరిశిక్ష అమలయ్యేది రాజమండ్రిలోనే

రాష్ట్రంలో ఎవరికి ఉరిశిక్ష పడినా అమలు చేసే సదుపాయం ఉండేది రాజమండ్రి సెంట్రల్ జైలులోనే. అక్కడ ఇద్దరు తలారులు అందుబాటులో ఉంటారు. రాష్ట్రంలో చివరగా ఉరిశిక్ష అమలు చేసింది 1978లో అని తెలుస్తోంది. ఆ తర్వాత ఎవరినీ ఉరి తీయలేదని జైళ్లశాఖ వర్గాలు చెబుతున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అన్నప్రసాదం ట్రస్టుకు 6 నెలల్లో రూ.180 కోట్ల విరాళాలు

తిరుమల, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): వెంగమాంబ అన్నప్రసాద ట్రస్టుకు భక్తుల నుంచి ఆరు నెలల కాలంలో రూ. 180 కోట్లు విరాళంగా అందాయి. అంటే సగటున రోజుకు కోటి రూపాయలు ఈ ఒక్క ట్రస్టుకే భక్తులు సమర్పిస్తున్నారు. శ్రీనివాసుడి సమక్షంలో అన్నదానం అన్నది గొప్ప పుణ్యకార్యక్రమం కావడంతో విశేషంగా స్పందిస్తున్నారు. ఇప్పటికే ఈ ట్రస్టు వద్ద రూ.2,300 కోట్లు డిపాజిట్లు రూపంలో ఉన్నాయి. ఈ మొత్తం మీద వచ్చే వడ్డీతోనే ప్రస్తుతం అన్నదాన కార్యక్రమం జరుగుతోంది. అన్నప్రసాదకేంద్రంలో ఆయుధ పూజ సందర్భంగా శుక్రవారం ఆయన మీడియాతో ముచ్చటిస్తూ టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఈ వివరాలు తెలిపారు. 1985లో అన్నదాన కార్యక్రమం తిరుమలలో ప్రారంభించగా 1994లో శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుగా మారి సేవలందిస్తోంది.

టీటీడీ ఆలయాలన్నింటిలోనూ అన్నదానం వెంగమాంబ భవనంతో పాటు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లు, బయట ఫుడ్ కౌంటర్ల ద్వారా కూడా అన్నప్రసాదాలు అందిస్తున్నారన్నారు. త్వరలో టీటీడీ అనుబంధ ఆలయాల్లోనూ రోజువారీ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ఇందుకోసం శ్రీవాణి ట్రస్టు నిధులను వినియోగిస్తామన్నారు.

అన్నప్రసాద భవనంలో ఆయుధపూజ

తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో శుక్రవారం ఆయుధపూజ జరిగింది. అన్నప్రసాదాల తయారీకి వినియోగించే యంత్రాలు, పాత్రలకు పూజలు చేశారు. అనంతరం అన్నదానం సిబ్బందిని ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ సత్కరించారు. కిచెన్‌తో పాటు కూరగాయలు నిల్వచేసే ప్రాంతాలను ఈవో పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. కాగా కిచెన్ ఆధునీకరణ సమయంలో చేయనున్న తాత్కాలిక ఏర్పాట్ల గురించి అధికారులు ఈవోకు వివరించారు.



విజిబుల్ పోలీసింగ్

● సాయంత్రం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు రోడ్లపై ఉండాలి
● కమ్యూనిటీ వ్యవస్థ బలోపేతానికి పటిష్ఠ ప్రణాళిక

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విజిబుల్ పోలీసింగ్‌కు ఎస్పీ సుబ్బరాయుడు ప్రాధాన్యమిస్తున్నారు. నేరాల కట్టడికి ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఈ దిశగా పోలీస్ యంత్రాంగాన్ని పటిష్ఠపరిచే చర్యలు చేపడుతున్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి అర్ధరాత్రి 11 గంటల వరకు పోలీసులు రోడ్లపైనే కనిపించాలంటూ డీఎస్పీలకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. దీంతో పోలీసు స్టేషన్ల వారీగా విజిబుల్ పోలీసింగ్‌కు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు ఎస్టీఎఫ్ పార్టీలను వెంట పెట్టుకుని ఎస్ఐలు, ఏఎస్ఐలు,పోలీసులు బృందాలుగా విడిపోయి రోడ్లపైకి వచ్చి పనిచేయాలని ఎస్పీ నిర్ణయించారు. రాత్రి 8 నుంచి 11 గంటల వరకు ఎస్ఐలు వీధుల్లోకి వచ్చి ప్రజలతో కలసి పర్యటించాలని చెప్పారు. నేరాలు, దొంగతనాలు, సైబర్ నేరాలు, గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్ కట్టడికి గట్టిగా పనిచేసి జిల్లాను నేర రహిత ప్రాంతంగా మార్చాలని అధికారులు ఆలోచిస్తున్నారు. ప్రజా చైతన్యంతోనే నేరాల కట్టడి సాధ్యపడుతుందని భావించిన సీఎం చంద్రబాబు ఆ దిశగా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. దీంతో ఉన్న సాంకేతిక వ్యవస్థలను వాడుకుంటూనే ప్రజల భాగస్వామ్యంతో 'కమ్యూనిటీ ఫస్ట్' పేరిట విస్తృతంగా ప్రజల్లోకి వెళ్ళి ప్రచారం చేయాలని ఎస్పీ సుబ్బరాయుడు నిర్ణయించారు. ఆర్థిక, సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించి.. కట్టడి చేసే దిశగా వ్యూహం రచిస్తున్నారు. మరోవైపు మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలు, హత్యలు నివారించడానికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు.

ఆగండి.. ముఖం కడుక్కుని వెళ్లండి

మరోవైపు రోడ్డు ప్రమాదాలు జరగుతున్న తీరు తెన్నులపై యంత్రాంగం అధ్యయనం చేసింది. ప్రధానంగా తెల్లవారు జామున 2 నుంచి 4 గంటల మధ్య రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పోలీసు శాఖ గుర్తించింది. ఈ క్రమంలో 'కాసేపు ఆగండి.. ముఖం కడుక్కుని వెళ్లండి' అంటూ వాహనాలను ఆపి తనిఖీలు చేసి డ్రైవర్లను నిద్ర మత్తులో నుంచి మేల్కొలిపే దిశగా ఆలోచిస్తున్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయండి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియ పూర్తయితే పీఎం కిసాన్ నగదు రైతుల ఖాతాలో జమవుతుందని చెప్పారు. కలెక్టరేట్‌లో శుక్రవారం డీఆర్వో నరసింహులుతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈకేవైసీ పెండింగ్, ఆధార్ నంబర్, బ్యాంకు ఖాతాలకు లింక్ కాకపోవడం, మ్యుటేషన్, రాంగ్ ఆధార్ వంటి సమస్యలతో పెండింగులో ఉన్న 57,096 దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. రెండు, మూడో విడతల్లో నగదు జమ చేసేటప్పటికి అర్హులైన రైతులను గుర్తించి లబ్ధి పొందేలా చూడాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్, సహాయ వ్యవసాయాధికారి ధనంజయరెడ్డి, కోఆపరేటివ్ అధికారిణి నాగవర్థనమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఎరువుల సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చూడండి

రైతులకు ఎరువుల సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు. పవన్, వ్యవసాయ సహాయ సంచాలకుడు ధనంజయరెడ్డి తదితరులతోసమీక్షించారు. యూరియా 7,969 టన్నులు, డీఏపీ 1,086 టన్నులు, ఎంవోపీ 527 టన్నులు, కాంప్లెక్సు 5,877 టన్నులు, ఎస్ఎస్‌పీ 1,328మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. యూరియా కార్డుల ద్వారా ప్రతి రైతుకూ ఎకరాకు 3 బస్తాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

● గూడూరు ఏరియా ఆస్పత్రిలో ఘటన

గూడూరు అర్బన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గూడూరు ఏరియా ఆస్పత్రిలో గురువారం రాత్రి బాలికపై వృద్ధుడు లైంగిక దాడికి యత్నించడంతో స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, ఆస్పత్రి సిబ్బంది తెలిపిన ప్రకారం.. ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తికి తోడుగా కుటుంబీకులు ఉన్నారు. అదే వార్డులో చికిత్స పొందుతున్న మరొకరికి తోడుగా జమీర్‌బాషా అనే వృద్ధుడు ఉన్నాడు. గురువారం రాత్రి మరో రోగి కుటుంబసభ్యులతో కలిసి నిద్రిస్తున్న బాలికపై జమీర్‌బాషా లైంగిక దాడికి యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో సిబ్బంది, స్థానికులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేసి ఒకటో పట్టణ పోలీసులకు అప్పగించారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో శుక్రవారం ఎస్పీ సుబ్బరాయుడు విచారణ చేపట్టారు. 'ఈ ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నాం. నిందితుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు చేపడతాం' అని ఆయన మీడియాకు చెప్పారు. విచారణలో ఏఎస్పీ మనోహరాచారి, డీఎస్పీలు గీతాకుమారి, చెంచుబాబు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి షిఫ్ట్ ఆపరేటర్ మృతి

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కరెంటు తీగలకు మరమ్మతులు చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై కాంట్రాక్ట్ షిఫ్ట్ ఆపరేటర్ కిన్నెర సాంబచిన్నయ్య (41) మృతి చెందారు. ఈ ఘటన బుచ్చినాయుడు కండ్రిగ మండలం లక్ష్మీపురం గిరిజన కాలనీ సమీపంలోని మామిడి తోటలో శుక్రవారం జరిగింది. నీర్పాకోట దళితవాడకు చెందిన సాంబచిన్నయ్య వెస్ట్‌వరత్తూరు సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా (ఒప్పంద ఉద్యోగి) పని చేస్తున్నారు. మొంథా తుఫానుతో లక్ష్మీపురం గిరిజన కాలనీ సమీపంలో పి.వెంకటసుబ్బయ్య నాయుడు మామిడి తోటలో మరమ్మతులకు గురైన విద్యుత్ వైర్లను సరి చేయడానికి శుక్రవారం ఉదయం 8గంటలకు వెళ్లారాయన. విద్యుత్ వైర్లకు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు 11కేవీ వైర్లు తలపై తగలడంతో మృతి చెందారు. ఉదయం 9గంటల నుంచి ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాకపోవడంతో సహ ఉద్యోగి సంఘటనా స్థలానికి వెళ్లారు. అక్కడ సాంబ చిన్నయ్య మృతి చెంది ఉన్నారు. ఆయన కుటుంబీకులకు, డిస్కం ఏఈ చలపతికి ఆయన సమాచారమిచ్చారు. ఎస్ఐ హరిప్రసాద్‌కు ఏఈ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా సాంబచిన్నయ్యకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. గతంలో ఒకసారి విద్యుదాఘాతానికి గురై కోలుకున్నారు.

అత్తి వరదరాజస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా కొలువై ఉన్న ప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో అత్తి వరదరాజ విగ్రహ ప్రతిస్థాపన పూజలుజరుగుతున్నాయి. ఇందులోభాగంగా శుక్రవారం స్వామివారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అంతకు ముందు పలురకాల హోమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ సాయిప్రసాద్, ఈవో బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రుత్వికుల హోమం



స్వామివారిని దర్శించుకుంటున్న ఈవో తదితరులు

భాగస్వామ్యంతో పాలన అనుసంధానం సాధ్యం

తిరుపతి ఐఐటీలో క్రిస్ప్ భాగస్వామ్యంతో జాతీయ వర్క్‌షాప్ ప్రారంభం

ఏర్పేడు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): భాగ స్వామం ద్వారా విద్యా సిద్ధాంతాలు, పాలన అంశాల మధ్య అనుసంధానం సాధ్యమవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. తిరుపతి లోని ఐఐటీ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగం, సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీం అండ్ పాలసీస్(క్రిస్ప్) సంయుక్తంగా మూడు రోజుల జాతీయస్థాయి వర్క్‌షాప్ పబ్లిక్ పాలసీ ఇన్ ప్రాక్టీస్‌ను అక్టోబరు 30 నుంచి నవంబరు 1 వరకు నిర్వహిస్తోంది. తిరపతి ఐఐటీ ప్రాంగణంలో అక్టోబరు 30న అధికారికంగా ప్రారంభించినప్పటికీ 31న నిపుణుల చర్చలు జరిగాయి. ఈ వర్క్‌షాప్‌లో ప్రజా విధానాల రూప కల్పన, అమలులో విశిష్ట సేవలందించిన ఐఏఎస్ అధికారులు, అకడమిక్ నిపుణులు, పరిశోధకులు పాల్గొని తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకుంటున్నారు. ఈ వర్క్‌షాప్‌లో విశ్రాంత ఐఏఎస్ అధికారులు ఎస్ఎం విజయా నంద్, సుబ్రహ్మణ్యం, ఆర్ఎస్ జులానియా, రాజీవ్ సదానందన్, ఎస్‌జే కుంటే, చంద్రమౌళి పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ... ఈ తరహా వర్క్‌షాప్‌లతో అనుభవాత్మక అభ్యాస్యాన్ని బలోపేతం చేస్తాయని తెలిపారు. అదే విధంగా క్రిస్ప్ సీఈవో ఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... భాగస్వామ్యం డేటా ఆధారిత పాలనకు మార్గం శుభం చేస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న పరిశోధకులు, పాలన, నిపుణులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రూపంలో ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ప్రజా విధానాల అనుభవాలపై పెరుగుతున్న ఆసక్తిని వర్క్‌షాప్ ప్రతిబింబించింది.

ప్రధాన చర్చలు

ఈ వర్క్‌షాప్‌లో పేదరిక నిర్మూలన, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యం, విద్య, జనాభా గణాంకాలు, నైపుణ్య ఆధారిత ఉన్నత విద్య వంటి ప్రధాన అంశాలపై చర్చలు జరిగాయి. విద్యార్థులు ప్రజా విధానాల రూపకల్పన, అమలులో ప్రయోగిక అవగాహన పొందేందుకు నిపుణులు మార్గదర్శకత్వం వహించారు.

ఐఐటీ తిరుపతి-క్రిస్ప్ ఒప్పందం

వర్క్‌షాప్ తొలిరోజు ఐఐటీ తిరుపతి, క్రిస్ప్ మధ్య దీర్ఘకాలిక భాగస్వామ్యానికి అవగాహన ఒప్పందం కుదిరింది. దీనిపై తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, క్రిస్ప్ కార్యదర్శి, సీఈవో సుబ్రహ్మణ్యం సంతకాలు చేశారు.విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయానంద్, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ భాగస్వామ్యం ద్వారా ప్రజా విధానాల బోధన, పరిశోధన, డేటా ఆధారిత పాలనలో రెండుసంస్థలు కలిసి పని చేయనున్నాయి.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, క్రిస్ సీఈవో సుబ్రహ్మణ్యం